

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక :236 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 10 సెప్టెంబర్ 2026 | వెల : 4/-




## భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు



## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన

# ఆ రెండూ కుట్రలే!

- స్పీకర్‌ను, శుద్ధి పేరుతో దళితులను అవమానించటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది
- వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై కేసులు పెడతాం: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తాం
- విచారణాధికారిగా హైదరాబాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్
- ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే కుట్రలు
- ఫామ్‌హౌస్ భేటీలోనే వ్యూహరచన.. కేసీఆర్ అనుచరులను ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారు
- దళితులను అవమానించిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలన్న సీఎం
- వారిలోని అహంకార, అంటరానితన భావాన్ని యాసిడ్‌తో శుద్ధి చేయాలా? అంటూ ప్రశ్న
- ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టీకరణ



హైదరాబాద్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన మాతృ మూర్తిని కించపరిచి అవమానించటం, అనంతరం ఆయనకు మద్దతుగా నిరసన తెలిపిన దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలను కుట్రలుగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఇందుకు వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై ఆయా సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తామని అన్నారు. ముంబయిపై దాడి చేసిన కసబ్ లాంటి ఉగ్రవాదులకు కొన్ని అంశాలను నూరిపోసి ఉన్మాదులుగా మార్చి మన దేశంపైకి పంపిన తరహాలోనే, కేసీఆర్ కూడా తన అనుచరులకు ఇలాగే నూరిపోసి ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారని ఆరోపించారు. దాంతో పేట్రేగిన నేతలు ఆ రోజు దళిత స్పీకర్‌ను కించపరచటమే లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి ముందురోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీలో చేసిన కుట్ర మొదలు ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న ఘటనలపై సంపూర్ణ విచారణ చేపడతామన్నారు. హైదరా బాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను - మిగతా3లో



# కోహెడకు రూ.637.70 కోట్లు

- ప్రపంచస్థాయి పండ్ల మార్కెట్ తొలి దశ పనులకు అనుమతి
- 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు
- మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు.

హైదరాబాద్

రాష్ట్ర రాజధానికి సమీపంలో కోహెడలో నిర్మించనున్న ప్రపంచస్థాయి సమగ్ర పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడటమే లక్ష్యంగా దీన్ని నిర్మిస్తోంది. మార్కెట్ తొలి దశ పనులకు రూ.637.70 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా - మిగతా3లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు



## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల
# సస్పెన్షన్



- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్
- సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- దీంతో సస్పన్షన్ వేటు వేస్తూ ప్రకటించిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- బీఆర్ఎస్ సభ్యులను సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన స్పీకర్

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, - మిగతా3లో

## శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు
# బీఆర్ఎస్ ఫిర్యాదు




- నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించాం
- శాసనసభ్యులపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం
- లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు
- శాంతిభద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా - మిగతా3లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్?తో పోలిస్తే భారీగానే వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే దాదాపు రూ.1,473 కోట్లు నిధులు వచ్చాయి. కానీ కాంగ్రెస్?కు మాత్రం కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి వచ్చిన ఆదాయం రూ.207 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే బీజేపీకి వచ్చిన మొత్తం నిధులు కాంగ్రెస్ కంటే ఏడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడించారు.



**బీజేపీ ఖాతాలో రూ.1,472.8 కోట్లు**

ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈసీకి సమర్పించిన వివరాల్లో వెల్లడైంది. అయితే కేరళ, బంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. ఆయా రాష్ట్రాల వివారలు కూడా కలిపితే పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రారంభంలో మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో సుమారు రూ.6,722.6 కోట్లు ఉన్నాయి. మే 6 నాటికి ఆ మొత్తం రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల వ్యవధిలోనే కేంద్ర కార్యాలయ నిధుల్లో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది.

**కాంగ్రెస్ నిధుల్లో తగ్గుదల**

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. ఐదు రాష్ట్రాల పార్టీ విభాగాలు, కేంద్ర కార్యాలయాన్ని కలిపి ఎన్నికల ప్రారంభంలో సుమారు రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు రూపంలో, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం సుమారు రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే ఎన్నికల కాలంలో కాంగ్రెస్ నిధుల్లో దాదాపు రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది.

**బీజేపీ ఖర్చు ఎక్కడెంత?**

ఇప్పటివరకు బహిర్గతమైన బీజేపీ వ్యయ వివరాల ప్రకారం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిల్లో సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించింది. అసోంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారానికి, రూ.19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చయ్యాయి. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలకు దాదాపు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. ఇక తమిళనాడులో బీజేపీ రూ.51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. మీడియా ప్రకటనలకు సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.10.04 కోట్లు ఖర్చు చేసింది. ప్రచార సామగ్రికి మరో రూ.5.85 కోట్ల వరకు వెచ్చించింది. పుదుచ్చేరిలో బీజేపీ మొత్తం రూ.11.90 కోట్ల ఎన్నికల వ్యయాన్ని చూపించింది. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులకు వెళ్లాయి.

**కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు రూ.248.55 కోట్లు**

ఇక కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో కలిపి రూ.248.55 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారానికి రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా, రాష్ట్ర, స్థానిక విభాగాలు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఈ వ్యయంలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ సాధారణ ప్రచారానికి రూ.59.28 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. ఢిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.



**ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ**

మిలిటరీ-టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైళ్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్-400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

**'సుఖోయ్-57' స్టెల్త్ ఫైటర్ జెట్**

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్-57' (రాబ-57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

**బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్**

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది.

దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్-రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై :** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

**సవరించిన పాఠ్య పుస్తకం**

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

**ముగిసిన కేసు**

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంఠాల్ చౌరాహా - ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు.2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

**'దైవ లీల'గా ప్రచారం**

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# మండల అభివృద్ధికి ప్రజాప్రతి నిధులకు, అధికారులు సహకరించాలి





**- పాల్వంచ సొసైటీ ఛైర్మన్ కొత్వాల**

**భద్రాది కొత్తగూడెం :** పాల్వంచలో మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న కొత్వాల పాల్వంచ మండల అభివృద్ధికై ప్రజాప్రతినిధులకు, అధికారులు సహకారం అందించాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డి.సి.ఎం.ఎస్ మాజి ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎం.పి.డి.ఒ. కార్యాలయంలో నిర్వహించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ప్రజాప్రతినిధుల పై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు వమ్ము చేయకుండా పంచాయితీలను సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని అన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు అవుతున్నారని, వారు మండల సమావేశాలకు విధిగా హాజరు కావాలన్నారు. తగిన సమాచారం ఇవ్వకుండా సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపిడిఒ రాజారావు , తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు

**యువత హక్కుల కోసం సంఘటిత పోరాటాలు నిర్వహిస్తాం: డివైఎఫ్ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ**



**భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ, సెప్టెంబర్ 09: యువత భవిష్యత్తుతో ప్రభుత్వాలు చెలగాటం ఆడకుండా, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డి వై ఎఫ్ ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ డిమాండ్ చేశారు. పాల్వంచ పట్టణంలోని మంచికంటి భవన్‌లో జరిగిన డివైఎఫ్ఐ పాల్వంచ పట్టణ మరియు మండల మహాసభలో జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ ముఖ్యఅతిగా పాల్గొని ప్రసంగించారు. కాళంగి హరికృష్ణ మాట్లాడుతూ దేశంలో యువత సంఖ్య, విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోవడం ఆందోళనకరమన్నారు. యువత చదువు పూర్తయింది.. ఉద్యోగం ఎక్కడ? అర్హత ఉంది.. నియామకం ఎక్కడ? నైపుణ్యం ఉంది.. అవకాశం ఎక్కడ? ఖాళీ పోస్టులు ఉన్నాయి.. భర్తీ ఎప్పుడు? అని ప్రభుత్వాలను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోరాటాల నుంచి పుట్టిన ఈఖీ× యువత సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటాలను నిర్మించాలనే లక్ష్యంతో 1980 నవంబర్ 3న లూధియానాలో డివైఎఫ్ఐ ఆవిర్భవించిందని హరికృష్ణ తెలిపారు.యువతను కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే తరంగా కాకుండా, అన్యాయాన్ని ప్రశ్నించే, హక్కుల కోసం పోరాడే, సమాజ మార్పుకు నాయకత్వం వహించే శక్తిగా తీర్చిదిద్దడమే డివైఎఫ్ఐ ఆశయమన్నారు.విద్య, ఉపాధి, ఉద్యోగం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల కోసం యువతను సంఘటితం చేయడమే డివై ఎఫ్ ఐ లక్ష్యమని తెలిపారు. "డి వై ఎఫ్ ఐ ఒక సంస్థ పేరు మాత్రమే కాదనీ యువత పోరాటాలకు ఒక వేదిక అని యువత హక్కులకు ఒక గొంతుక ని కాళంగి హరికృష్ణ అన్నారు. ప్రశ్నించడం యువత హక్కు జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా, రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా యువత సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందనీ ప్రభుత్వాలను ప్రశ్నించడం వ్యతిరేకత కాదనీ అది ప్రజాస్వామ్య హక్కనీ యువత మౌనంగా ఉంటే సమస్యలు కొనసాగుతాయనీ . యువత ప్రశ్నిస్తే మార్పు మొదలవుతుందనీ డి వై ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు లీక్కీ బాలరాజు అన్నారు యువతను కులం, మతం, ప్రాంతం పేరుతో విడదీసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, మాదకద్రవ్యాలు, మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ ఆలోచనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను చైతన్యానికి ఉపయోగించాలనీ నేటి యువత చేతిలో ఉన్న సోషల్ మీడియా శక్తిని ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించేందుకు ఉపయోగించాలని బాలరాజు సూచించారు. "వైరల్ అయ్యే విషయాలను ఫాలో అయ్యే యువత కాదు.. సమాజాన్ని మార్చే ఆలోచనలను వైరల్ చేసే యువత కావాలి. ట్రెండ్‌ను ఫాలో అయ్యే తరం కాదు.. మార్పుకు కొత్త ట్రెండ్‌ను సృష్టించే తరంగా ఎదగాలి."అని అన్నారు. పాల్వంచ పట్టణ మరియు మండల నూతన కమిటీ మహాసభలో పాల్వంచ పట్టణ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ బి . వినయ్ , కార్యదర్శి గా సూర్య , మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బాలాజీ వెంపటి, పోతురాజు పవన్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి కాళంగి హరికృష్ణ ,లక్కి బాలరాజు అభినందనలు తెలిపారు. పాల్వంచ పట్టణ , మండల యువత సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, మరింత మంది యువతను సంఘటితం చేయాలని సూచించారు. మౌనంగా ఉండే యువత చరిత్రను చదువుతుందనీ , ప్రశ్నించే యువత చరిత్రను రాస్తుందనీ , యువత తమ భవిష్యత్తును ఎవరో నిర్ణయిస్తారని ఎదురుచూడకుండా, తమ హక్కుల కోసం తామే నిలబడాలనీ వారు పిలుపునిచ్చారు. యువత హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం డి వై ఎఫ్ ఐ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మహాసభలో డి వై ఎఫ్ ఐ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్వంచ పట్టణ మండల కమిటీ

# నిత్యవసర ధరల పెరుగుదలపై కలెక్టరేట్ ముందు ప్రగతిశీల మహిళా సంఘం వినూత్న నిరసన..





**సూర్యపేట :** రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు అందించాలని డిమాండ్ నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం (గాంఖ) ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముందు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. కట్టెల పొయ్యిపై నూనె లేకుండా కూరగాయలు వండుతూ మహిళలు తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)కు అందజేశారు. ఈ సందర్భంగా గాంఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల నిర్ణయాల కారణంగానే నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని అన్నారు. గత నెలలో కిలో చక్కెర ధర రూ.42 ఉండగా ప్రస్తుతం రూ.85కు చేరిందని పేర్కొంటూ, ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనని చెప్పారు. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు సహా అన్ని నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారుప్రజల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు మేలు చేసే విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించి, రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను పేద ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గాంఖ జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషిమాత, జిల్లా కమిటీ సభ్యులు ఐతరాజు పద్మ, కట్ట కల్పన, జయమ్మ, పద్మ, రేణుక, అనసూయ, గౌరమ్మ, మమత, రహమతి, మీనాక్షి, రాధా, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక దందాకు అడ్డుకట్ట అదుపులో నిందితుడు బోలిరో వాహనం




**సిద్ధిపేట :** 09-09-2026 రోజున రామంచ గ్రామం నుండి కోహెడ మీదుగా సిద్ధిపేట కు బోలెరో వాహనంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా కోహెడ గ్రామ శివారులో కోహెడ మండలం పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి అక్రమాలకు అడ్డుకట్ట నంబర్ టీ జీ 02 ౨ 4931ఒక బోలెరో వాహనాన్ని పట్టుకొనీ కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించినా సబ్ ఇన్స్పెక్టర్ అభిలాష్ నిందితుని పై కేసు నమోదు చేయడం జరిగింది, బోలెరో వాహనం టీ జీ 02- -4931, జెట్టి అజయ్ కుమార్ వయసు 28 , గ్రామం నవాబుపేట చిగురుమామిడి మండల చెంద8నా వ్యక్తి గా గుర్తించారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మరియు జైలు శిక్ష కూడా తప్పదని ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్పి అభిలాష్ తెలిపారు

## ప్రమాదకరంగా విద్యుత్ సరఫరా



**సిద్ధిపేట : హుస్నాబాద్** ప్రమాదకరంగా విద్యుత్ సరఫరా వైర్లు వేలాడుతున్న రైతుకు ప్రమాదకరంగా దుక్కి దున్నేందుకు అడ్డుగా ఉన్న వైర్లను రైతు కట్టలతో ఎత్తిపట్టుకుని దున్నతున్నవైనం పట్టించుకొని విద్యుత్ శాఖ ప్రమాదం జరిగితే తప్ప నిద్రలేవని అధికారగణం రైతే రాజు అంటున్న ప్రభుత్వం కానీ రైతుకు ప్రమాదకరంగా భద్రతలేని వైనం వర్షం పడితే దుక్కిదున్నని పరిస్థితి దున్నలనిప్రయత్నం చేస్తే ప్రమాదం పరుగులు పెడుతుంది ఇప్పటికైన అధికారులు నిద్రమత్తు వదలని రైతుకొరుతున్నారు

## రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సిలింగ్ అతి చేస్తే తాట తీస్తాం

**డీఎస్పీ శివరాం రెడ్డి హెచ్చరిక**

**నల్లగొండ :** నల్గొండ నల్గొండ జిల్లాలో శాంతిభద్రతలు సామరస్యంగా ఉన్నాయని,




రౌడీషీటర్లు తమకు రాజకీయ నాయకుల బలం ఉందని అతి చేస్తే ఉపేక్షించేది లేదని, తాటతీస్తామని డీఎస్పీ శివరాం రెడ్డి హెచ్చరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్క రౌడీషీటర్ పై ప్రత్యేకంగా నిఘా ఉంటుందని, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో పీడీ యాక్ట్ తో పాటు జైలు శిక్ష కఠినంగా అమలు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని 80 నుంచి 100 మంది రౌడీషీటర్లకు డీఎస్పీ కార్యాలయంలో కౌన్సిలింగ్ మరియు బైండోవర్ చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదని జిల్లా ఎస్పీ కఠిన హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి, టూ టౌన్ ఎస్ఐ సైదాబాబు, రూరల్ ఎస్ఐ శివతేజ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

## అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హవాలా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలి,

**మక్తబాయి చందుకుమార్.**



**జహీరాబాద్:** బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాత ప్రజా హక్కుల సంరక్షకుడు ప్రజాస్వామ్యవాది అపార జ్ఞాన సంపన్నుడు మేధావి సంఘసంస్కర్త అయినటువంటి మహానేత మీద కల్పిత నాయకుడు అనే పుస్తకం రాస్తూ అంబేద్కర్ ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నటువంటి హవాలా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలని సంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్ట్ మక్తబాయి చందుకుమార్ డిమాండ్ చేశారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందినటువంటి బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశంలో ప్రధానమంత్రి రాష్ట్రపతి మొదలుకొని సామాన్య ప్రజానీకం వరకు అందరి నీరాజనాలు అందుకుంటున్నటువంటి వ్యక్తి అంబేద్కర్ అలాంటి వ్యక్తి పైన బురద జల్లడానికి అంబేద్కర్ ఒక కల్పిత నాయకుడు అని అంబేద్కర్ పైన పుస్తకం రాస్తున్నాడు. భారత రాజ్యాంగం రాయడ కల్పితమా అని ప్రశ్నించారు.ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి భారత రాజ్యాంగాన్ని హక్కులను ఇవ్వడం కల్పితమా ఈరోజు ఇలాంటి దుష్టశక్తులు మాట్లాడడానికి మాట్లాడే స్వేచ్ఛ అంబేద్కర్ ఇవ్వడం కల్పితమా ప్రభుత్వాలు తెలుసుకొని హమారా ప్రసాద్ మీద కేసు పెట్టి కఠినంగా శిక్షించి జైలుకు పంపాల్సినటువంటి అవసరం ఉంది ఇలాంటి మూర్ఖులు సమాజానికి చీడపురుగుల్లాగా ఉన్మాదులు మాదిరిగా సమాజంలో తిరిగితే మరింత మంది ఉన్మాదులు తయారు అయ్యే అవకాశం ఉంటుంది కనుక ఇలాంటి వారిని జైల్లో పెట్టి శిక్షించవలసింది సంగారెడ్డి జిల్లా సీనియర్ జర్నలిస్ట్ మక్తబాయి చందుకుమార్, కౌడి నర్సిములు పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## వ్యవసాయానికి డేంజర్ బెల్స్

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమిటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బులో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

# ఇస్రో పై ‘వేటు’?



నరేంద్రమోదీ నేతృత్వంలో 12 ఏండ్ల క్రితం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడు తుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. జరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్–స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. నాయకత్వం మాత్రం ప్రభుత్వ సంస్థ చేతుల్లోనే ఉండాలి. లేకపోతే ప్రపంచం విస్తుపోయే అభివృద్ధిని సాధించిన ఇస్రో, రేపు కార్పొరేట్ లాభాల వేటలో తన అసలైన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉన్నది.

# చట్టసభల దగ్గరే ప్రజాస్వామ్యానికి తూట్లు




తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజే జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపెట్టేవిగా ఉన్నాయి. సభలో ప్రతిపక్షం -- అధికారపక్షం మధ్య రాజకీయ ఘర్షణలు జరుగడం కొత్త కాదు. కానీ శాసనసభ్యులు సభలోకి ప్రవేశించకముందే పోలీసుల ద్వారా అడ్డుకోవడం, నిరసన వ్యక్తం చేయడానికి వారు ఎంచుకున్న దుస్తులను కూడా ఒక సమస్యగా పరిగణించడం దారుణం. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తీసుకొచ్చేవిగా ఉన్నాయి. ప్రతిపక్ష సభ్యులు నల్ల దుస్తులు ధరించడం ఒక నిరసన రూపం. అది సభా కార్యకలాపాలను అడ్డుకోవడం కంటే ముందే నేరంగా మారిపోదు. దుస్తులపై ఏవైనా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఉంటే వాటిని తీసేసి రమ్మని చెప్పవచ్చు. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అధికారపక్షానికే కాదు, ప్రతిపక్షానికీ ఉంటుంది. ఆ నిరసన సభా నియమాలను ఉల్లంఘిస్తే సభాపతి చర్య తీసుకోవచ్చు. కానీ సభా ప్రాంగణంలోకి అడుగుపెట్టకముందే పోలీసుల ద్వారా సభ్యులను అడ్డుకోవడం మాత్రం అత్యంత తీవ్రమైన పరిణామం. శాసనసభ్యులను పోలీసులు తోసేయడం, లాగడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య సంస్థల గౌరవానికి విరుద్ధం. మహిళా శాసనసభ్యుల విషయంలో పోలీసుల ప్రవర్తన మరింత ఆందోళన కలిగించే విషయం. మహిళా సభ్యులను పురుష పోలీసులు అడ్డుకున్నారనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం పోలీసింగ్ పద్ధతిపై మాత్రమే ప్రశ్న కాదు, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, భద్రత, హక్కులపై ప్రశ్న. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలువాల్సిన శాసనసభ గుమ్మం దగ్గరే ఇటువంటి దృశ్యాలు కనిపించడం మంచి సంకేతం కాదు. దేశ రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘర్షణలు ఎన్నో హెచ్చరికలు ఇచ్చాయి. తమిళనాడు శాసనసభలో జయలలితకు ఎదురైన అవమానకర ఘటనలు ఇప్పటికీ రాజకీయ చరిత్రలో మిగిలిపోయాయి. సభలో రాజకీయ ప్రత్యర్థిత్వం హద్దులు దాటితే అది వ్యక్తుల మధ్య ఘర్షణగా మొదలై, చివరకు సంస్థల ప్రతిష్టను దెబ్బతీస్తుంది. తెలంగాణ ఆ దారిలో నడువకూడదు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యల వివాదాన్ని కూడా రాజకీయ వివేకంతో చూడాల్సిన అవసరం ఉన్నది.

తాను చేసిన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి కాదని ఆయన స్పష్టంచేశారు. ఒకవేళ స్పీకర్‌కు అలా అనిపించినట్టయితే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానని, తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని కూడా ప్రకటించారు. ఒక ప్రజాప్రతినిధి తన వ్యాఖ్యపై విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా అదే అంశాన్ని సభ మొత్తాన్ని స్తంభింపజేసే స్థాయికి తీసుకెళ్లడం అవసరమా అనేది ఆలోచించాల్సిన ప్రశ్న.

స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనది. ఆ పదవిని అవమానించేలా ఎవరు మాట్లాడినా ఖండించాల్సిందే. అదే సమయంలో స్పీకర్ కూడా సభను అన్ని పక్షాలకు సమానంగా అందుబాటులో ఉంచే రాజ్యాంగబద్ధమైన పాత్రను పోషించాలి. ఒక సభ్యుడి వ్యాఖ్యను మొత్తం ప్రతిపక్షానికి, ఒక పార్టీకి, లేదా ఒక సామాజిక వర్గానికి అంటగట్టడం కూడా సరైన ప్రజాస్వామ్య పద్ధతి కాదు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉన్నది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య తీవ్రంగా ఉన్నది. ఉద్యోగులు పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోసం చూస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై ముందస్తు ప్రణాళిక అవసరమని నిపుణులు సూచనలు చేస్తున్నారు. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి, వాటి పరిష్కారంలో పారదర్శకత లేకపోవడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి సమస్యలపై సభలో సమగ్ర చర్చ జరుగాల్సిన సమయంలో సభ ఈ విధమైన గందరగోళమైన పరిస్థితిలో నడువడం, సభా సమయాన్ని వృథా చేయడం ప్రజల పట్ల అన్యాయం. ఇక్కడ కాంగ్రెస్‌కు ఒక విషయం గుర్తుండాలి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంటును నిర్వహించకుండా ఆటంకాలు కలిగిస్తున్నదని కాంగ్రెస్ విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాని, హోంమంత్రి సభకు రావాలని డిమాండ్ చేస్తూ సభను స్తంభింపజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరి అదే రాజకీయ సంస్కృతి రాష్ట్ర శాసనసభలో అధికారపక్షంగా ఉన్నప్పుడు ఎందుకు మారాలి? ప్రజాస్వామ్యం అంటే అధికారపక్షం మాట్లాడటం కాదు. ప్రతిపక్షం మాట్లాడటం కూడా కాదు. అధికారపక్షం మాట్లాడినంత సమయం ప్రతిపక్షానికి కూడా మాట్లాడే అవకాశం ఉండటం. ప్రతిపక్షం నిరసన తెలిపినంత మాత్రాన దాన్ని అణచివేయకుండా, సభా నియమాల పరిధిలో ఎదుర్కోవడం, సభా సమయాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం. పోలీసులు ప్రభుత్వానికి రాజకీయ రక్షక దళం కాదు. వారు చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ. ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రభుత్వ శత్రువులు కాదు. వారు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు. ఈ రెండు వాస్తవాలను ప్రభుత్వం మరచిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. సోమవారం జరిగిన ఘటనను కేవలం కాంగ్రెస్‌బీఆర్ఎస్ రాజకీయ గొడవగా కొట్టిపారేయడం సరిపోదు. ఇది తెలంగాణ శాసనసభ ప్రతిష్టకు సంబంధించిన విషయం. సభ గుమ్మం దగ్గరే ప్రజాప్రతినిధులను అడ్డుకొనే పరిస్థితి ఏర్పడితే, రేపు ఏ ప్రభుత్వం వచ్చినా అదే పద్ధతిని అనుసరించే ప్రమాదం ఉంటుంది కదా! ఒకసారి అధికారానికి ఈ మార్గం అలవాటైతే, ప్రతిపక్షంలోకి వెళ్లినప్పుడు అదే అధికారాన్ని విమర్శించే నైతిక హక్కు రాజకీయ పార్టీలకు బలహీనమవుతుంది.

జరిగినది ఎవరి విజయమూ కాదు. అధికారపక్షానిది కాదు, ప్రతిపక్షానిదీ కాదు. అది ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టం. శాసనసభ గుమ్మం ప్రజాప్రతినిధులకు మూసుకుపోయే రోజు ప్రజల గొంతుకకు కూడా తలుపులు మూసుకుపోయిన రోజు. తెలంగాణ రాజకీయ వ్యవస్థ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకూడదు. అధికారపక్షం ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ప్రతిపక్షం సభా నియమాలను గౌరవించాలి. స్పీకర్ అన్ని పక్షాలకు న్యాయమైన వేదిక కల్పించాలి. పోలీసులు రాజకీయ ఆదేశాల కంటే రాజ్యాంగబద్ధమైన బాధ్యతకు కట్టుబడి ఉండాలి. లేకపోతే శాసనసభ ప్రజాస్వామ్య చర్చల నిలయం కాకుండా, అధికార -- ప్రతిపక్ష యుద్ధరంగంగా మిగిలిపోతుంది. ప్రజలు మాత్రం బయట నిలబడి తమ సమస్యలకు సమాధానం కోసం ఎదురు చూస్తూనే ఉంటారు.

సూర్య
తెలుగు దినపత్రిక



## నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతాం..

జనసేన నేత కంచర్ల నర్సాగౌడ్




**కామారెడ్డి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు నేమూరి శంకర్ గౌడ్ ఆదేశాల మేరకు జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ మీసాల శ్రీనివాస్ రావు సూచనలతో కామారెడ్డి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా నాయకులు శంకర్ గౌడ్,రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాసరావు,ఇతర రాష్ట్ర నాయకులను అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ నాయకులు కంచర్ల నర్సాగౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు రెండు పార్టీలు తోడుదొంగలు వ్యవహరిస్తూ 22-ఏ ఆర్టికల్ పై జనసేన పార్టీ నిలదీసి అడుగుతే పవిత్రమైన అసెంబ్లీ సాక్షిగా అక్రమ అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.అన్యాయంగా జనసేన పార్టీ నాయకులుపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.పార్టీ సీనియర్ నాయకులు నక్క మల్లేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీ కలిసి తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని అణచివేసే కుట్రలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుని అక్రమ అరెస్టులు జరిగాయని ఆయన అన్నారుఎన్ని అక్రమ అరెస్టు చేసిన నిరంతరం జనసేన పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని నక్క మల్లేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కామారెడ్డి జిల్లా నాయకులు కంచర్ల నర్సాగౌడ్,నక్క మల్లేష్,జాజిరి దినేష్ కుమార్,ఆశయాల స్వామి,సతీష్ కుమార్,కృష్ణ, స్వామి,మలయాళ ప్రభాకర్,సంగీ రవి,తదితరులు పాల్గొన్నారు

## కవ్వాల్ టైగర్ జోన్ ఎత్తివేయాలి..ఎమ్మెల్యే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలి




**జన్నారం,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా,జన్నారం కవ్వాల్ టైగర్ జోన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ భూమచారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష 19వ రోజుకు చేరుకుంది.దీక్షకు జన్నారం మండల బీజేపీ శ్రేణులు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు భూమచారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ...కవ్వాల్ టైగర్ జోన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అసెంబ్లీలో వెంటనే తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు కొంతం శంకరయ్య,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ అజ్మీరా బద్రినాయక్,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్,జిల్లా నాయకుడు సంతోష్,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు పిట్ట రాజారావు,బిపోనకల్ ఉపసర్పంచ్ అప్పల జలపాతి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలకవర్గం చేత ఘన సన్మానం..



**నిజాంపేట, సెప్టెంబర్09 (సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్ మాట్లాడుతూ...పాఠశాల హెచ్ఎం పద్మారెడ్డి,ఉపాధ్యాయ బృందం చేస్తున్న కృషి ఫలితంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య42 నుంచి 77కు పెరిగిందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మారెడ్డి మాట్లాడుతూ... గ్రామపంచాయతీ పాలకవర్గం అందించిన గౌరవం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు.

## అక్రమ అరెస్టులతో భయపడేది లేదు..

గుండా సంతోష నేత






**నిజామాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** జనసేన పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు శాసనసభ ముట్టడిలో భాగంగా రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం జరిగినది.అందులో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా జనసేన పార్టీ నాయకుడు గుండా సంతోష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కి మెమొరండం సమర్పించడం జరిగింది.శాంతియుతంగా మౌనం పాటించడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం22ఏ బాధితులకు తగిన న్యాయం చేయాలని మరియు విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఈ కార్యక్రమం నిజామాబాద్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.లేని పక్షాన ఈ నిరసన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది.ఈ నీరసం కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు,నుర రాహుల్,ధనంజయ్,ప్రసాద్,జానీ,లక్ష్మణ్,లడ్డు, మనీ,లు పాల్గొని విజయవంతం చేశారు.

## జనసేన పార్టీ నిరసన దీక్ష..



**లింగంపేట్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**జనసేన పార్టీ రాష్ట్ర ఇంచార్జి శంకర్ గౌడ్, జనసేన రాష్ట్ర నాయకులు మీసాల శ్రీనివాసరావు,ల ఆదేశాలు మేరకు లింగంపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు మామిడి సాయిలు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం పూల మాల వేసి నివాళులర్పించి నిరసన దీక్ష చేశారు.అనంతరం ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు మామిడి సాయిలు మాట్లాడుతూ...జనసేన రాష్ట్ర నాయకులను అసెంబ్లీ ముందు శాంతి యుత నిరసన కార్యక్రమం చేసేందుకు వెళ్ళితే పోలీస్ లు అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని ఆరోపించారు. చర్చించడానికి రాష్ట్రశీలో యూరియా కొరత,పీజు బకాయిలు,22ఏ జాబితా,ఉద్యోగుల సమస్యలు ఉండగా అధికార దాహం కోసం కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు మనగఢ కోసం సమస్యలను పక్కదారి పట్టేంచే విధంగా చీకటి ఒప్పందం చేసుకొని ఈ పార్టీలు తన్నుకుంటూ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ అసెంబ్లీ సాక్షిగా వీళ్ళు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజా సమస్యలను ప్రజలలోకి తీసుకెళ్లి మిమ్మల్ని ఓడగొట్టి ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మామిడి సాయిలు అన్నారు.ఇకనైనా బుద్ధి తెచ్చుకుని అసెంబ్లీలో రైతుల,విద్యార్థులు,నిరుపేద భూములపై,రాష్ట్ర అభివృద్ధి గురించి చర్చించి ప్రజలకు మేలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లింగంపేట మండలం జనసేన పార్టీ నాయకులు ఎల్లమ్మల భాస్కర్,నాగం సంజీవులు, కొజ్జాపురం రాజేష్,ముస్తాపూర్,గణేష్,మన్నె బాలరాజు తోపాటు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో ఎస్ఐఆర్‌పై గ్రామ సభ..



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)**మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై గ్రామ సభ నిర్వహించారు.సర్పంచ్ సేగ్యం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండల తహసీల్దార్ పనకంటి సతీష్‌కుమార్ శర్మ హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియ,ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామస్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...ప్రతి ఓటరు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో పేరు,చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే సంబంధిత ప్రక్రియ ద్వారా సవరణలు చేసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ కార్యదర్శితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## సెప్టెంబర్10న జనసేన భారీ ఆత్మీయ సమావేశం..



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మంచిర్యాల వేదికగా జనసేన పార్టీ రాజకీయ బలాన్ని చాటేందుకు సిద్ధమవుతోంది.పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా సెప్టెంబర్ 10న భారీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.మంచిర్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో జరిగే ఈ సమావేశానికి 'చలో మంచిర్యాల' పేరుతో పెద్ద ఎత్తున జనసమీకరణకు పిలుపునిచ్చారు.జనసేన సీనియర్ నాయకులు ఆవుల సాగర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'చలో మంచిర్యాల' పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి--ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్,చెన్నూర్ నియోజకవర్గ నాయకులు జీవన్ వడ్లకొండ,రాష్ట్ర అధికార ప్రతినిధి మూలా హరీష్ మాట్లాడుతూ...రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడంతో పాటు నాయకులు,కార్యకర్తలు, అభిమానుల మధ్య మరింత ఐక్యత పెంపొందించేందుకు సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో పార్టీ విస్తరణకు కార్యకర్తల భాగస్వామ్యం కీలకమని,సమావేశానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ ముఖ్యనాయకులు పిట్టల సుధాకర్, రాసమల్ల రాజేష్,వాసాల అజయ్,చరణ్,పవన్‌తో పాటు పలువురు కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు..



**బెల్లంపల్లి,సెప్టెంబర్09 (సూర్యరేఖ)**బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రముఖ తెలంగాణ కవి,రచయిత ,ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి,కమిషనర్ తన్నీరు రమేష్,కౌన్సిలర్లు,అధికారులు,సిబ్బంది పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రజల జీవన విధానం, సమస్యలు,ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రజలకు చేరువ చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని అన్నారు.అన్యాయం,అక్రమాలు,దోపిడీ,సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా తన కలాన్ని ఆయుధంగా మలిచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు.తెలంగాణ భాష,యాస,సంస్కృతి పరిరక్షణకు కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల పట్ల బాధ్యతతో, సామాజిక స్పృహతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మజహార్,డీఈ సుమతి, ఏఈ నిఖిల్,ఆర్వో భుజంగరావు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు పట్టణంలో మృతి చెందిన వారిని పరామర్శించి నివాళులర్పించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్





**ఖమ్మం,సెప్టెంబర్09(సూర్యరేఖ)** కల్లూరు పట్టణంలోని వచ్చానాయక్ తండాకు చెందిన కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్ బానోత్ పంతులు తండ్రి బానోత్ రాములు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా వచ్చానాయక్ తండాలో ఇటీవల పాము కాటుతో మృతి చెందిన బానోత్ పద్మ దశదిన కర్మ కార్యక్రమానికి డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై,ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమాల్లో కల్లూరు మున్సిపల్ చైర్మన్ దారావత్ మోహన్ నాయక్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కల్లూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉస్మాన్, యువ నాయకులు,భుక్య శివకుమార్,పోట్రూ చక్రి, సంఘం రామకృష్ణ,శీలం కృష్ణారెడ్డి,నల్లగట్ల పుల్లయ్య,కుంచాల గురవయ్య,బైర్ల కాంతారావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ..



**నిజాంపేట,సెప్టెంబర్09(సూర్యరేఖ)** పీఎం శ్రీనిజాంపేట పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్ జి ఎఫ్) క్రీడా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు రజాక్‌పల్లి గ్రామానికి చెందిన నీలం కనకరాజు రూ.10వేల విలువైన క్రీడా దుస్తులను బహుకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో క్రీడా దుస్తులను అందించిన కనకరాజును పాఠశాల బృందం ఘనంగా సన్మానించింది.విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు మహేందర్,పిటి ప్రవీణ్,ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్ చారి,వందన,సౌజన్య,ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు తప్పిదాల సవరణ పూర్తి చేసుకోవాలి:

తహసీల్దార్ శ్రీనివాస్




**నిజాంపేట,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మండల వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల్లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. ఎస్ఐఆర్ నోటీసులకు సంబంధించి వివరాల్లో తప్పులు ఉన్న ఓటర్లకు వాటిని సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. తప్పిదాల సవరణ కోసం ఓటర్లు ఆధార్ కార్డు లేదా ఎస్ఎస్‌సీ మెమో వంటి ధ్రువపత్రాలను సమర్పించి వివరాలను సరిచేసుకోవచ్చని తెలిపారు .ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఓటరు మహాశయులు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు.

# ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యం..





**మందమర్రి సర్కిల్‌లో పోలీసింగ్ మరింత పటిష్టం..**

**పెండింగ్ కేసుల పరిష్కారం,మహిళల భద్రత,డ్రగ్స్ నియంత్రణపై ఫోకస్..**

**సిపి అంబర్ కిషోర్ ఝా**

**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ప్రజలకు మరింత భరోసా కల్పించేలా పోలీసింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు నేరాలకు అడ్డుకట్ట వేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. మందమర్రి సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించిన సీపీ..సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు,నేరాల నియంత్రణ,కేసుల దర్యాప్తు,మహిళల భద్రత,ట్రాఫిక్ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు.మందమర్రి సర్కిల్ విస్తృత భౌగోళిక పరిధి కలిగి ఉండటంతో పోలీసులకు ప్రత్యేక సవాళ్లు ఉన్నాయని సీపీ పేర్కొన్నారు. మందమర్రి పట్టణంతో పాటు రామకృష్ణాపూర్,కాసిపేట ,దేవాపూర్, మారుమూల, గిరిజన ప్రాంతాలు సర్కిల్ పరిధిలో ఉన్నందున ప్రతి ప్రాంతంలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రజల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా పోలీసింగ్ ఉండాలని,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు.సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు,దర్యాప్తులో ఉన్న కేసులు,పెండింగ్ ట్రయల్ కేసుల ఫైళ్లను సీపీ పరిశీలించారు.కేసుల పురోగతి,నిందితుల అరెస్టులు, దర్యాప్తు స్థితి,పెండింగ్‌కు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రాపర్టీ నేరాలను సమర్థవంతంగా ఛేదిస్తున్న సీఐ రమేష్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.షీటీమ్స్,మహిళా పోలీసు సిబ్బంది కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి మహిళల్లో భద్రతా భావాన్ని పెంపొందించాలని ఆదేశించారు. గంజాయి,డ్రగ్స్,ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయాలు,వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీమ్స్ ద్వారా మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు డ్రగ్స్, గంజాయి కేసులు రెండింతలు ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించారు.మత్తు పదార్థాలకు బానిసైన వారిని నేరస్తులుగా మాత్రమే చూడకుండా, వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా 15రోజుల పాటు చికిత్స, అవసరమైన సహాయం అందిస్తున్నామని తెలిపారు. రహదారులు,రైల్వే మార్గాల ద్వారా రాకపోకలు అధికంగా ఉండే మందమర్రి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. . పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సీజ్ చేసిన వాహనాలను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని,అన్ని రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు.గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా టాస్క్‌ఫోర్స్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# నాలుగు సంవత్సరాల నుండి ఫీజు బకాయిలు రాక కళాశాలల ఇబ్బందులు..



**కామారెడ్డి సెప్టెంబర్09(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ప్రాంగణంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం పట్టణంలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు,యాజమాన్యాలు పెండింగ్ ఫీజు బకాయాలను విడుదల చేయాలని కోరుతూ మానవహారం నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం టాస్క్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బాలు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరి వల్ల లక్షలాదిమంది విద్యార్థులు కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కోర్సులు పూర్తి అయిన ఫీజు బకాయలు రాకపోవడంతో కళాశాలలో సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉన్నదని అన్నారు. 2021 సంవత్సరం చెల్లించాల్సిన ఫీజు బకాయలు చెల్లించకుండా 2026బకాయిలను విడుదల చేస్తానని చెప్పి విద్యార్థులను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు,చరిత్రలో విద్యార్థులను, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలు అన్ని అధికారాన్ని కోల్పోయాయని,అదే పరిస్థితి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తుందని అన్నారు.ప్రజాపాలన పేరుతో దగా పాలన చేస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని,దానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు అమృత దత్తాద్రి,సాయిబాబా,కొడిపాక సత్యనారాయణ,విజయ్ కుమార్,మనోజ్ కుమార్,అనిల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# వర్షాలు లేక ఎండిపోతున్న వరి పంటలు..




**రైతులకు ఎకరాకు రూ.15వేల నష్టపరిహారం ఇవ్వాలి..**




**నిజాంపేట,సెప్టెంబర్09(సూర్యరేఖ)**మండల వ్యాప్తంగా గత పదిహేను రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి.దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.నిజాంపేటకు చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు,రైతు అబ్దుల్ అజీజ్ సన్నరకం జైశ్రీరామ్ వరి సాగు చేయగా,ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రైతుల పంటలకు ఇబ్బందులు.. అబ్దుల్ అజీజ్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని మాజీ కోసం సభ్యుడు రైతు అబ్దుల్ అజీజ్ ఆవేదన వ్యక్తం చేశారు.వరి పంట సాగు కోసం ఎకరాకు సుమారు రూ.30వేల వరకు పెట్టుబడి ఖర్చవుతుందని తెలిపారు.ప్రస్తుతం వర్షాలు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి,రైతులకు ఎకరాకు రూ.15వేల చొప్పున నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని రైతుల పక్షాన ఆయన డిమాండ్ చేశారు.

## కోకో పోటీల్లో నిజాంపేట పాఠశాల సత్తా..



**నిజాంపేట,సెప్టెంబర్09(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం రెండో రోజు కోకో పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి.అండర్--17బాలుర విభాగంలో నిజాంపేట పాఠశాల మొదటి స్థానం సాధించగా,చల్మెడ హైస్కూల్ రెండో స్థానం సాధించింది.అండర్--17బాలికల విభాగంలో నిజాంపేట పాఠశాల మొదటి స్థానం సాధించగా, నస్కల్ పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. అలాగే అండర్--14బాలుర విభాగంలో నిజాంపేట పాఠశాల మొదటి స్థానం సాధించగా,చల్మెడ పాఠశాల రెండో స్థానంలో నిలిచింది.పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పిటి ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కళాకారుని నైపుణ్యం హమారా దేశ్ కి నేత రాహుల్ గాంధీ..






**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఉత్తరప్రదేశ్ లోని కీలకమైన చిన్న రైల్వే స్టేషన్లలో ఒకటి అయిన కాసీంపూర్ రైల్వే స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ అభిమాని షాదాబ్ సృష్టించిన అద్భుత కళా నైపుణ్య చిత్రమని,కళాకారుని నైపుణ్యం హమారా దేశ్ కి నేత రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ అధ్యక్షులు గజరే కిషన్ పేర్కొన్నారు.ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గజరే కిషన్ మాట్లాడుతూ... ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 2024లో మార్చిన పేర్ల ప్రకారం,కాసీంపూర్ హాల్ట్ అనే ఈ స్టేషన్‌ను జాయస్ సిటీగా మార్చారు.ఇది ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా జాయస్ నగర సమీపంలో జాయస్ సలోన్ రోడ్డు నేషనల్ హైవే 931ఏ పక్కన ఉందని,ఇది కళాకారులకు పుట్టినిల్లు అని కొనియాడారు.ఈ సృష్టి కళాకారుల ప్రశంసలు అందుకొంది,కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత చిత్రపటాన్ని చూసి చిత్రకారుడిని అభినందించారని గజరే కిషన్ పేర్కొన్నారు

## వెంకట్ రెడ్డినగర్ డివిజన్లో జలమండలి అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించిన

**ఆకారపు అరుణ్ పటేల్**



**వెంకట్ రెడ్డినగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సత్యనగర్, లక్ష్మీశ్రీకాంత్ నగర్ కాలనీల్లో నెలకొన్న మురుగునీటి సమస్య పరిష్కారానికి ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని,అధికారికంగా మంజూరు కానప్పటికీ సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా సుమారు150 మీటర్ల డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టేలా కాంట్రాక్టర్‌తో నేరుగా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ప్రధాన రోడ్డుపై అక్రమంగా నిర్మించిన షెడ్ కారణంగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఇబ్బందులు ఏర్పడుతున్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే షెడ్డును తొలగించాలని కోరారుఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రవీందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వినయ్,స్థానిక నాయకులు,కాలనీ ప్రజలు పాల్గొన్నారు.మిగిలిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులను ఆకారపు అరుణ్ పటేల్ కోరారు.

## అడవిపంది మాంసంతో ముగ్గురు పట్టివేత..




**బెల్లంపల్లి,సెప్టెంబర్08(సూర్యరేఖ)** అటవీశాఖ పరిధిలో అడవిపంది మాంసంతో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు.ధర్మారావుపేట సెక్షన్, ధర్మారావుపేట బీట్ పరిధిలోని బుగ్గగూడ గ్రామ సమీపంలోని పత్తిచేనులో సంకుర్తల శ్రీకాంత్ వద్ద అడవిపంది మాంసం లభించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.ముందస్తు సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలంలో గాలింపు చేపట్టి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో అడవిపందిని వేటాడి చంపినట్లు శ్రీకాంత్ అంగీకరించినట్లు తెలిపారు. మాంసం కొనుగోలు చేసేందుకు వచ్చిన శ్రీనివాస్, రంజిత్‌ల పేర్లను వెల్లడించడంతో వారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై ముగ్గురిపై సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రేంజ్ అధికారి సీహెచ్.పూర్ణచందర్ తెలిపారు.

## మియాపూర్ సర్కిల్-48లో పారిశుధ్య తనిఖీలు..





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మియాపూర్ సర్కిల్–48,ఎల్.పి.జెడ్ పరిధిలోని ప్రజయ్ సిటీ,మక్తా మహబూబ్‌పేట్ డివిజన్‌లోని పీకే ఎన్‌క్లేవ్‌లో పారిశుధ్య తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఆర్ డబ్ల్యూఏ ప్రతినిధులతో మాట్లాడి,డిసి –48, ఈఈ,ఎస్ఎస్ తో కలిసి ట్రీ పార్క్‌ను పరిశీలించారు. పారిశుధ్యం,పౌర సౌకర్యాలపై సమీక్షించి,స్థానిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు.

## సంతోష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విఫల పాలనపై భారీ నిరసన..




**శేరిలింగంపల్లి, సెప్టెం బర్09(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి శాసనసభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ మాధవరం కృష్ణరావు సూచన మేరకు1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై సంతోష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యమకారులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంతోష్ ముదిరాజ్ మాట్లాడుతూ... 1000రోజుల కాంగ్రెస్ పాలనలో దోచుకోవడం,దాచుకోవడం తప్ప, ప్రజలకు ఏమి మేలు జరగలేదని,అధికారంలోకి రావటానికి అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని అన్నారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో మహేందర్,జుబేర్,లక్ష్మణ్, శ్రీనివాస్ నాయుడు,ఇమ్రాన్,మల్లేశం,మల్లేశ్ గౌడ్, షాబుద్దీన్,తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

## పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల ప్రవర్తించడం దారుణం..

**బిఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షులు రాము..**



**నిజాంపేట,సెప్టెంబర్09(సూర్యరేఖ)** అసెంబ్లీ సమావేశానికి వెళ్తున్న బిఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రులు ఎమ్మెల్యే హరీష్ రావు,కేటీఆర్,మహిళ సబితఇంద్రారెడ్డి,పై దాడి హేయమైన చర్య నిజాంపేట మండల యూత్ ఉపాధ్యక్షులు రాము అన్నారు.రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా పోలీసులు నీ ప్రవర్తన మార్చుకోవాలని రానున్నది మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే అని వారు ధీమా వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్‌తో ప్రజలు సతమతం..

**ప్రభుత్వాలు చెప్పేది ఒకటి..బీఎల్ఓలు చెప్పేది మరొకటి**

**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి: పసులేటి వెంకటేష్**



**బెల్లంపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఎస్ఐఆర్ ప్రక్రియతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలో ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వాలు ఒక విషయం చెబుతుంటే,క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సూచించిన 11పత్రాల్లో ఏదైనా ఒక పత్రం సమర్పించాలని చెబుతుండగా,కొంతమంది బీఎల్ఓలు అదనంగా ఆధార్,పాన్ కార్డు వంటి పత్రాలు తీసుకురావాలని ప్రజలను కోరుతున్నారని తెలిపారు.దీంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ రెండో దశపై అవగాహన సమావేశం..

**నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించాలి..**



**బెల్లంపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో ఎస్ఐఆర్ రెండో దశకు సంబంధించి బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు .బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు,మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య అధ్యక్షతన,బెల్లంపల్లి తహసీల్దార్ శ్రీకృష్ణ ఆహ్వానం మేరకు ఈ సమావేశం జరిగింది.మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌బాబు సమక్షంలో అధికారులు ఎస్ఐఆర్‌లో నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై వివరించారు.ఎన్యూమరేషన్,మ్యాపింగ్ కాని ఓటర్లు నోటీసులు అందుకున్నట్లయితే,అవసరమైన పత్రాలను గడువులోగా సమర్పించాలని అధికారులు సూచించారు.ఎస్ఐఆర్ గడువు పొడిగించినందున నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ మాజీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి రాము,సీనియర్ నాయకుడు జాన్ సుందర్,కాంగ్రెస్ పార్టీ 103వ బూత్ బీఎల్ఏ నాంచర్ల రాము,మైనార్టీ నాయకుడు ఎం.డి.ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప కవి కాళోజీ నారాయణ రావు..






## సమాజాన్ని జాగృతం చేసిన కవి కాళోజీ నారాయణరావు..

### అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య

**రాజేంద్రనగర్,సెప్టెంబర్08(సూర్యరేఖ)** కాలాన్ని ఆయుధంగా మార్చుకుని తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య అన్నారు.బుధవారం అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు,ప్రజాకవి,పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య మాట్లాడుతూ...రచనల ద్వారా ప్రజలను చైతన్య వంతం చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప కవి కాళోజీ నారాయణరావు అని అన్నారు. సమాజంలో పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ప్రజలకు ప్రశ్నించడం నేర్పి సమ సమాజ నిర్మాణానికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి కాళోజీ అని పేర్కొన్నారు.కాళోజీ స్ఫూర్తి తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచి అని పేర్కొన్నారు.పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని నినదించిన కాళోజీ జీవితమంతా తెలంగాణ బాషా సాహితీ సేవా దిశగా సాగిందన్నారు.తెలంగాణ తొలి దశ ఉద్యమాలకు ప్రతిధ్వనిగా నిలిచిన మహనీయుడు కాళోజీ అని కీర్తించారు.కాళోజీ నారాయణ భాషా సాహిత్యానికి చేసిన సేవలను కొనియాడారు.కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఒక ప్రసిద్ధ ప్రజాకవి మాత్రమే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుడని అన్నారు.తన జీవితంలో అన్యాయం ఏ రూపంలో ఉన్న ఎక్కడ ఉన్నా ఎదిరించడమే ఆయన నైజం అని తెలిపారు.అన్యాయాన్ని ఎదిరిస్తే గొడవకు సంతృప్తి, అంతరిస్తే ఆ గొడవకు ముక్తి ప్రాప్తి అన్న గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు.స్వతంత్ర భారతంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారని చెప్పారు.తన కలంతో ఎన్నో కవితలు రాసి ప్రజలను,యువకులను ప్రభావితం చేసిన గొప్ప కవి కాళోజీ అని కొనియాడారు.సమసమాజ నిర్మాణానికి కాళోజీ బాటలు వేసారని,ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమం ఊపిరిగా జీవించిన ప్రజాకవి,తెలుగు భాష,ప్రజల అవసరాల కోసం కాళోజీ నిరంతరం కృషి చేశారని,తన కవితలు,రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు"పుట్టుక నీది,చావు నీది,బతుకంతా దేశానిది"అని నినదించిన కాళోజీ జీవితం మొత్తం తెలంగాణ భాషా,సాహిత్య సేవకు అంకితం చేయడమే కాకుండా,వివక్ష ఎక్కడ ఉన్నా వ్యతిరేకరించి,అణచివేత అన్యాయాలపై ధిక్కారస్వరం వినిపించారని తెలిపారు.ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి ప్రజలకు సేవచేయాలని మల్లయ్య పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో ఈఈ వెంకటాశేషయ్య,జోనల్ ఏవో చంద్రశేఖర్ రెడ్డి,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం..

### ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ




**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)**తెలంగాణ భాష,యాస, సంస్కృతి ,ప్రజా చైతన్యానికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అన్నారు.ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం జీఎం మాట్లాడుతూ...తన రచనలు,ప్రసంగాల ద్వారా సమాజంలోని సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లిన వ్యక్తిగా కాళోజీ ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నించే ధైర్యాన్ని ఆయన రచనలు కల్పించాయని పేర్కొన్నారు.కాళోజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ భాషా వైభవానికి మరింత గుర్తింపు లభించిందన్నారు."పుట్టుక నీది..చావు నీది..బతుకంతా దేశానిది"అన్న కాళోజీ సందేశం ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉందన్నారు.నేటి యువత ఆయన సాహిత్యాన్ని చదివి, ఆయన ఆశయాలను జీవితంలో ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం జి.ఎల్.ప్రసాద్,ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సి.వి.రమణ,సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి,ఏరియా ఈఅండ్ఎం ఏజీఎం బాలాజీ భగవతిజ,కేకే ఏజెంట్ ఖదీర్,శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్,కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు,డీజీఎం (పర్సనల్)సీహెచ్.అశోక్, సీనియర్ పీవో ఆర్.సత్యనారాయణతో పాటు అధికారులు,ఉద్యోగులు,కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల తీరుపై.. భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు





## స్పీకర్‌ను దూషించిన వారి సభ్యత్వం రద్దు చేయాలి..

### నాచారం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లో ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు..

**మల్లాపూర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన స్పీకర్‌ను ఎలా దూషిస్తారంటూ ప్రశ్నించారు.కేసులు నమోదు చేయడం,సభ నుంచి సస్పెషన్ చేయడం కాదు..ఏకంగా సభ్యత్వాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపు మేరకు నాచారం,మల్లాపూర్, శక్తిసాయినగర్,హెచ్ఎంటీనగర్,హెచ్‌బీకాలనీ డివిజన్లల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పట్ల వ్యవహరించిన తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దళితుడైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల దురుసుగా,అమార్యదగా, దుర్బాషలాడిన ఎమ్మెల్సీలు తాత మధు,నవీన్‌కుమార్‌రెడ్డి,ల సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం కేవలం ఈ సెషన్ సమావేశాలకు మాత్రమే రాకుండా సస్పెండ్ చేయడం సరైన చర్య కాదన్నారు.దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్, హరీష్‌రావునే వహించాలన్నారు. కార్యక్రమంలో నాచారం,హెచ్ఎంటి కాలనీ,మల్లాపూర్,శక్తిసాయి నగర్ కాలనీ,హెచ్ బికాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి..

### మాజీ కార్పోరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్

**చిలుకానగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి,పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్,జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ కోరారు.ఈ మేరకు బుధవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్‌ను కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలంటూ వినతిపత్రం అందజేశారు.సాయిరాంనగర్ కాలనీలో పలు సీసీ రోడ్లు,ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు.అదేవిధంగా చిల్కానగర్ బొడ్రాయి ఎదురుగా ఉన్న వీధులు,కుమ్మరికుంటలోని రోడ్ నంబర్-3కు సంబంధించిన సీసీ రోడ్డు పనులకు ఇప్పటికే సాంక్షన్లు పూర్తయినప్పటికీ టెండర్లు నిర్వహించకుండా కాలయాపన జరుగుతోందని పేర్కొన్నారు.వెంటనే టెండర్లు పిలిచి సీసీ రోడ్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.చిల్కానగర్ డివిజన్‌లో పారిశుధ్య సమస్యలపై కూడా ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జీవీపీ పాయింట్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి, ఉదయం9గంటలలోపే చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ వినతిపై డిప్యూటీ కమిషనర్ ఆనంద్ సానుకూలంగా స్పందిస్తూ,వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెలగౌడ్,శానిటేషన్ డీఈ నీలిమ,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి,జల్లి మోహన్,కొక్కొండ జగన్,బాలకృష్ణగౌడ్,తదితరులు పాల్గొన్నారు.



## తవ్విన రోడ్లతో కాలనీ వాసులకు తప్పని తిప్పలు..

### నెలలు గడుస్తున్నా తవ్విన రోడ్లకు మోక్షం లేదు..

### పునరుద్ధరణకు డిప్యూటీ కమిషనర్ తో కాలనీవాసుల విజ్ఞప్తి..



**ఉప్పల్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఉప్పల్ పరిధిలోని హనుమసాయినగర్,విజయపురి కాలనీ,సూర్యనగర్ కాలనీల్లో తవ్విన రోడ్లను నెలలు గడుస్తున్నా పునరుద్ధరించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హనుమ సాయినగర్, విజయపురి కాలనీ ,సూర్యనగర్ కాలనీలను కలిపే జంక్షన్ నుంచి ఆయా కాలనీల వైపు వెళ్లే రోడ్లను తవ్వి నెల రోజులు దాటినా పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఎలివేటెడ్ కారిడార్ పనుల కారణంగా వరంగల్ హైవేను మూసివేయడంతో వాహనాల రాకపోకలు హనుమసాయినగర్,విజయపురికాలనీ, సూర్యనగ ర్ కాలనీల మీదుగా నాగోల్ వైపు మళ్లాయి.దీంతో తవ్విన రోడ్లు,గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు స్పష్టంగా లేకపోవడంతో వాహనదారులు ఎటువైపు వెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాలనీల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ ,క్షేత్రస్థాయిలో మాత్రం తవ్విన రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలకు నరకయాతనను మిగుల్చుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్లను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి తవ్విన రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి,కాలనీవాసులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్ల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మేకల మధుసూదన్ రెడ్డి,సూర్యనగర్ కాలనీ అధ్యక్షులు జెట్ట సుధాకర్, ఫకీరు నర్సిరెడ్డి,లింగారెడ్డి,సుధాకర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క ఆపరేషన్..





### మూసీ తీరంలో దోమల నివారణకు ప్రత్యేకంగా రెండు హిటాచి యంత్రాలు.!

### నిరంతరంగా పనులు..

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి,జిహెచ్ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ రవికిరణ్

**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మూసి నదిలో దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారిన గుర్రపు డెక్కను తొలగించే పనిని జిహెచ్ఎంసి అధికారులు బుధవారం నుంచి యుద్ధ ప్రాతిపదికని చేపట్టారు.ఇందుకోసం ప్రత్యేకంగా రెండు హిటాచి యంత్రాలను కొనుగోలు చేశారు.అత్తాపూర్ బ్రిడ్జి నుంచి బాపు ఘాట్ వరకు మూసీకి ఇరువైపులా నదిలో గుర్రపు డెక్కన్ తొలగించడానికి హిటాచీలతో గుర్రపు డెక్కను తొలగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.గుర్రపు డెక్క తొలగించడంతోపాటు యాంటీ లార్వల్ ఆపరేషన్ను నిరంతరంగా కొనసాగించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి,జిహెచ్ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ రవికిరణ్ స్థానిక అధికారులను ఆదేశించారు.గుర్రపు డెక్క తొలగించడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు డ్రోన్ల సాయంతో యాంటీ లార్వాలను పిచికారి చేస్తున్నారు.దోమల వృద్ధికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి,దశలవారీగా నివారణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

### ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం..

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు నదిలో ఉన్న గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించనున్నట్లు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాసరెడ్డి,జిహెచ్ఎంసి హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ రవికిరణ్ వెల్లడించారు.ఈ ప్రత్యేక చర్యల ద్వారా దోమల వృద్ధిని అణచివేసి,నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే జీహెచ్ఎంసీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇటీవల దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దోమల బెడదను నియంత్రించేందుకు ప్రత్యేకంగా హిటాచి యంత్రాలను ఉపయోగించడం స్థానికంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు.జిహెచ్ఎంసి ఆరోగ్య విభాగం అధికారి ధరావత్ సాగర్ పర్యవేక్షణలో గుర్రపు డెక్క ఆపరేషన్ కొనసాగుతున్నది.ఈ ప్రక్రియలో స్థానిక అధికారులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో టాఫిక్ పోలీస్,టౌన్ ప్లానింగ్ విభాగాలకు రాజకీయ జోక్యం లేని ప్రత్యేక అధికారులైనా ఇవ్వండి..

### లేదా వ్యవస్థలను తొలగించండి..

### రాష్ట్ర ప్రథమ పోవురుడికి విన్నపం ..

**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** హైదరాబాద్ నగర్ రోడ్లపై బైక్ నడిపేటోడికి హెల్మెట్ లేదని,ఒకే బైక్ పై ముగ్గురు వెళు న్నారని,అది కూడా రాంగ్ రూట్లో వన్వేలో వాహనాలకు ఎదురుగా వెళ్తున్నా ఘటన,అది చూసి అక్కడున్న ట్రాఫిక్ సిబ్బంది ఆ బైక్ ను ఫోటో తీస్తే ట్రాఫిక్ పోలీసులనే చితకబాది,అమ్మనా బూతులు తిట్టి ఆ ఫోటోను డిలీట్ చేయించారు.మరి కాంగ్రెస్ పాలనలో పోలీసులకే రక్షణ లేదు,మరి ఇక రోడ్డుపై వెళ్లే వృద్దుల,సామాన్య ప్రయాణికుల పరిస్థితి ఏంటి భారతదేశంలో తెలంగాణ ఉందా లేకుంటే హైదరాబాద్ రజాకార్ల పాలన సాగుతోందా అని ఓ వృధుడు ప్రభుత్వాన్ని ప్రశ్నింస్తున్నాడు.ఈ సందర్భంగా ఆ వృధుడు ఆవేదన వ్యక్తం చేస్తూ..నగర ప్రయాణం ప్రమాద కరంగా మారిందని,50 సంత్సరాల పూర్వము జనాభాకు అనుగుణంగా రూపొందించిన రోడ్లు విస్తరించక పొగ ఉన్న రోడ్డు ఇరుపక్కల వ్యాపారస్తులు సగం రోడ్డు కబళించారు.ఉన్న సగం రోడ్డులో పార్కింగ్ వ్యవస్థ సక్రమంగా లేక వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలను,రోడ్డును కబ్జా చేసిన వాటిని నియంత్రించడం మన ప్రభుత్వ మున్సిపల్ శాఖ,టౌన్ ప్లానింగ్ వ్యవస్థకు గని,ఇటు ట్రాఫిక్ పోలీస్ లకు పట్టదు..ఆరకంగా నిజాయితీగల అధికారులు చర్యలకు పూనుకొంటే,సిబందిపై, అధికారులపై ఓ పక్క దాడులు,మరో పక్క రాజకియా నేతల ఒత్తిళు ,ట్రాన్స్ఫర్లు ఇది మన వ్యవస్థ.అందుకే హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో టాఫిక్ పోలీస్ లుగా,టౌన్ ప్లానింగ్ విభాగాల్లో విధి నిర్వహణలో పని చేస్తున్న వారికీ రాజకీయ జోక్యం లేని ప్రత్యేక




అధికారులైనా ఇవ్వండి యని,అది సాధ్యం కాకపోతే హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పాత పట్టణ నియోజక వర్గాలలో టాఫిక్ పోలీస్ వ్యవస్థను,టౌన్ ప్లానింగ్ వ్యవస్థలను పూర్తిగా తొలగించండి యని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ప్రథమ పౌరుడిని వేడుకొంటున్నారు.

## పండుగను సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలి..

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల,సెప్టెంబర్09(సూర్యరేఖ)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి.ఎ.భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సల్లా రమ్య,చెన్నూర్,క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ లతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు.గణేష్ మండపాల ఏర్పాటు,విద్యుత్,పారిశుద్ధ్యం,తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా డి.సి.పి. మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసుశాఖకు సహకరించాలని,శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, హిందూ ఉత్సవకమిటీ సభ్యులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలకు ఆదరించు సేవా సమితి అండ..

### చిన్నారుల చదువుకు,భవిష్యత్తుకు తోడుగా ఉంటామని భరోసా..




**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** అమ్మానాన్నలను కోల్పోయి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు చిన్నారులకు ఆదరించు సేవా సమితి అండగా నిలిచింది.కన్నవారిని కోల్పోయిన బాధలో ఉన్న ఆ పిల్లల కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించి మానవత్వాన్ని చాటుకుంది.మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియా డబుల్ బెడ్రూమ్ కాలనీకి చెందిన చంటి రమేష్,మల్లేశ్వరి దంపతులు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు.కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన ఈ దంపతులు ఒకరి తర్వాత ఒకరు మృత్యువాత పడటంతో వారి ఇద్దరు పిల్లలు దిక్కులేనివారయ్యారు.తల్లిదండ్రులే లోకంగా జీవించిన చిన్నారులు ఒక్కసారిగా పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ పరిస్థితి విషాదకరంగా మారింది.చిన్నారుల దీనస్థితిని స్థానికులు ఆదరించు సేవా సమితి దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన సమితి సభ్యులు వెంటనే వారి ఇంటికి చేరుకుని 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు.కష్టకాలంలో తమను ఆదుకునేందుకు ఎవరో ఒకరు ముందుకొచ్చారనే భరోసాను ఆ కుటుంబానికి కల్పించారు.ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపకులు మాట్లాడుతూ...తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను కేవలం ప్రస్తుత అవసరాలకే పరిమితం కాకుండా,వారి చదువు, భవిష్యత్తు అవసరాల్లోనూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం మానవతా బాధ్యత అని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరద రాబర్ట్,కంపాటి మురళీ,సిపతి రమేష్,సోమరాపు సామ్యూయల్,తొగరి రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపానికి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించిన ఎంవైఏ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు



**సికింద్రాబాద్,సెప్టెంబర్09 (సూర్యరేఖ)** బౌద్ధనగర్ ప్రాంతంలో ఎంవైఏ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నాటి ఆనంద్ కుమార్ నాయకత్వం లో గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు .గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపం భక్తులతో కళకళలాడు తోంది.ప్రతిరోజూ ప్రత్యేక పూజలు,హారతులు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందిస్తున్నారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావుగౌడ్,తీగుళ్ళ కిషోర్ గౌడ్,తీగుళ్ళ కిరణ్ గౌడ్,యూత్ ఐకాన్ రామేశ్వరంగౌడ్,లను గణేష్ మండపానికి సాదరంగా ఆహ్వానించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు మండపానికి విచ్చేసే ఆయనకు ఘన స్వాగతం పలికి,గణనాథుని ఆశీస్సులు పొందేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉద్యమకారుడు, మాజీ వార్డు మెంబర్ మంద జగన్, చింతకింది మల్లేష్ ఒగ్గు శ్రీధర్,నాగరాజు,రవి,శివ, తిరుమల రవి,తిరుమల సంతోష్,దిండిగల్ శ్రీకాంత్, తౌటం సతీష్,ఆనందాస్ కరుణాకర్,మధు,శెట్టి సాయి కృష్ణ,మనోజ్,సాయికిరణ్,ఆమంచ బ్రహ్మ సాయి,ఆదిత్య,నిఖిల్, అఖిల్,అవినాష్ ,శ్యామల, శివకుమార్,బంటి, రోహిత్,శ్రీనాథ్,శ్రీకాంత్, కందకట్ల రోహిత్,సంతోష్,దీపక్,పులి శివకుమార్,ఆశిష్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సాయిజన్ శేఖర్




**నాచారం,సెప్టెంబర్09 (సూర్యరేఖ)**హెచ్ఎంటీ నగర్ డివిజన్లకు చెందిన పలువురు పేదలు,అనారోగ్యంతో బాధపడుతున్న వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి దరఖాస్తు చేసుకున్నారు .వారి దరఖాస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సీఎం కార్యాలయం ద్వారా రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించేందుకు కృషి చేశారు.మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్,బన్నెపాక పరశురాం పంపిణీ చేశారు.బన్నెపాక పరశురాంకు రూ.42,000,టి. రేఖకు రూ.37,500,బి.శశిరేఖకు రూ.54,000 విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.

## చట్టసభల్లో ప్రజా సమస్యలే ప్రధాన చర్చ కావాలి..

జనసేన నాయకుడ్గ జాజారి దినేష్ కుమార్



**కామారెడ్డి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** చట్ట సభల్లో ప్రజా సమస్యలే ప్రధాన చర్చ కావాలి కానీ కాంగ్రెస్,భారత రాష్ట్ర సమితి నాయకులు రాజకీయ ఆధిపత్యం కోసం శాసనసభను అడ్డగా చేసుకొని ప్రవర్తించడం సిగ్గుచేటని అని కామారెడ్డి జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు దినేష్ కుమార్ అన్నారు. మంగళవారం శాంతియుతంగా ర్యాలీగా అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్ ఇతర నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండించారు. అధికారపక్షం ప్రభుత్వాన్ని నడపాలి,ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి ,ప్రభుత్వం తప్పు చేస్తే నిలదీయాలి, ప్రత్యామ్నాయ విధానాలను సూచించాలి,సభ సమయాన్ని వృధా చేయకూడదు,ప్రజా సమస్యలపై నిర్మాత్మకంగా వ్యవహరించాలి కానీ రెండు రోజులుగా అసెంబ్లీలో జరుగుతున్న పరిమాణాలు శాసనసభ స్పీకర్ ను అవమానించడం చాలా బాధాకరం వెంటనే భారత రాష్ట్ర సమితి చెందిన ఎమ్మెల్సీ తాత మధును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జనసేన పార్టీ నుండి డిమాండ్ చేశారు.కాంగ్రెస్,భారత రాష్ట్ర సమితి పార్టీ రెండు పార్టీలు కలిసి తెలంగాణలో జనసేన పార్టీని రాకుండా చేయాలని ఎత్తుగడలో భాగంగానే గత రెండు రోజులుగా సృష్టిస్తున్న అల్లర్లు నిదర్శనానికి కారణం..ఎవరినీ కుట్రలు పండిన 2028లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.ఎన్డీఏ కూటమితో కలిసి జనసేన పార్టీ తెలంగాణలో జెండా ఎగరవేస్తామని పార్టీ సీనియర్ నాయకుడు జాజారి దినేష్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.జనసేన పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు..

మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలి..కాలుష్యాన్ని నివారించాలి

హిందూ ఉత్సవ సమితి,ధర్మజాగరణ సభ్యుల పిలుపు



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** వినాయక చవితి,దసరా ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని హిందూ ఉత్సవ సమితి,ధర్మజాగరణ సభ్యులు పిలుపునిచ్చారు. మందమర్రి పట్టణంలోని అందుగులపేట సింగరేణి కాలేజీ సమీపంలో శ్రీఆర్ట్ ఈకో ఫ్రెండ్లీ ఆధ్వర్యంలో కళాకారుడు కొప్పు శ్రీనివాస్ తయారు చేసిన మట్టి గణపతి,దుర్గాదేవి విగ్రహాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.సహజసిద్ధమైన మట్టితో అందమైన కళాకృతులను రూపొందించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిం చుకునేలా విగ్రహాలను అందిస్తున్నట్లు కళాకారుడు కొప్పు శ్రీనివాస్ తెలిపారు.మట్టి విగ్రహాలను వినియోగించడం వల్ల నిమజ్జనం సమయంలో పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. రసాయనాలు,ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి సభ్యులు రామటెంకి దుర్గరాజు, ఆకుదారి లక్ష్మీనారాయణ,పైడిమల్ల అరుణ్‌కుమార్, చెలిమిటి చంద్రమౌళి, దుస్స రాజన్న,వాసాల కుమార్,పోతారవేణి సదానందం,కళాకారులు కొప్పు శ్రీనివాస్,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నరేష్ యాదవ్‌ను పరామర్శించిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, సెప్టెంబర్09(సూర్యరేఖ)** అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్ యాదవ్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పరామర్శించారు.నరేష్ యాదవ్ ఆరోగ్యం బాగాలేదని తెలుసుకున్న కార్తీక్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.అనారోగ్యంతో ఉన్న నరేష్ యాదవ్‌కు ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్ యాదవ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు .ప్రజలు,కార్యకర్తలు,నాయకులు పరస్పరం ఒకరికొకరు అండగా నిలవడం రాజకీయాలకు అతీతంగా మానవతా విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు.నరేష్ యాదవ్ త్వరగా కోలుకుని సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు శీలం తిరుపతి రెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,వీర్లపల్లి నవీన్ కుమార్,సదాల వెంకటరెడ్డి,శివముదిరాజ్,రాముయాదవ్,తానేష్ గౌడ్,పచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.నరేష్ యాదవ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని నాయకులు ఆకాంక్షించారు.

# ఒక్కరి స్ఫూర్తి..312 మందికి అక్షర జ్యోతి

కాశిపేట లంబాడీ తండా వాలంటీర్ రాజేశ్వరి సేవలకు ఢిల్లీలో ప్రశంసలు..

ఉల్లాస్ మేళాలో తెలంగాణ విజయగాథకు ప్రత్యేక గుర్తింపు..



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఒక్కరి సంకల్పం..వందలాది మందికి అక్షర జ్యోతి.. చదువు అందని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాశిపేట మండలంలోని లంబాడీ తండాలో ఉల్లాస్ వాలంటీర్‌గా రాజేశ్వరి చేసిన సేవలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి.న్యూఢిల్లీలో నిర్వహించిన ఉల్లాస్ మేళాలో ఆమె విజయగాథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్ బాల్ భవన్‌లో నిర్వహించిన ఉల్లాస్ మేళా--నవ భారత సాక్షరతా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన స్టాల్‌కు విశేష ప్రశంసలు లభించాయి.తెలంగాణలో ఉల్లాస్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించిన అడిషనల్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్తి ఐఏఎస్ అభినందించారు.ముఖ్యంగా లంబాడీ తండాల్లో చేపడుతున్న అక్షరాస్యత కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా పరిశీలించారు.మహిళా వాలంటీర్లు ముందుండి నిర్వహిస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ప్రశంసించారు.

**312మందికి అక్షర జ్ఞానం..**

కాశిపేట మండలంలోని లంబాడీ తండాకు చెందిన వాలంటీర్ రాజేశ్వరి 312మంది గ్రామస్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం విశేషంగా నిలిచింది. అంతటితో ఆగకుండా మరో 32మందికి ఉచిత వృత్తి శిక్షణలో భాగంగా కుట్టు శిక్షణ అందించారు.దీంతో ఆమె సేవలను గుర్తించిన నిర్వాహకులు రాజేశ్వరిని ప్రత్యేకంగా అభినందించి,ఆమెను ఉల్లాస్ కార్యక్రమంలోని 'సక్సెస్ స్టోరీ'గా ఇంటర్వ్యూ చేశారు.

**తెలంగాణ సంస్కృతికి ఘన ప్రదర్శన..**

మేళాలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.లంబాడీ నృత్యంతో పాటు బతుకమ్మ,బోనాలు,పోతురాజు ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.డిప్యూటీ డైరెక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో డీఆర్‌పీలు బండ శాంఖరి,శైలజ, రాజేశ్వరి,కవిత,జ్యోతి, భూమమ్మ,రాజు ,హరీలాల్ తదితరులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి .సీఎన్‌సీఎల్ ప్రొఫెసర్ ఉషా శర్మ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను కూడా ఉల్లాస్ వాలంటీర్లుగా భాగస్వాములను చేసి అక్షరాస్యత కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ నుమాన్ మాట్లాడుతూ...జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ ఉల్లాస్ కార్యక్రమాలకు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు.వివిధ రాష్ట్రాల ఉత్తమ పద్ధతులను తెలుసుకుని వాటిని అనుసరించడం ద్వారా అక్షరాస్యత కార్యక్రమాల ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు.రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ... ఢిల్లీలో వివిధ రాష్ట్రాల విజయగాథలను తెలుసుకోవడం తెలంగాణ బృందానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు.ఈ స్ఫూర్తితో రాష్ట్రంలో ఉల్లాస్ కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఖ

# ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వనంపల్లి జైపాల్ రెడ్డి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగో మహాసభలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్6,7,8తేదీల్లో నిర్వహించారు.కార్మికుల హక్కుల పరిరక్షణ,ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు,కార్మిక సంక్షేమం తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.సెప్టెంబర్6న భారీ కార్మిక ప్రదర్శన,బహిరంగ సభ నిర్వహించగా7,8 తేదీల్లో ప్రతినిధుల మహాసభలు కొనసాగాయి.కరీంనగర్‌లో నిర్వహించిన ఈ మహాసభలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కార్మిక ప్రతినిధులు హాజరయ్యారు.కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని మహాసభల్లో పిలుపునిచ్చారు.ఈ మహాసభల్లో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ ప్రాంతానికి చెందిన తెలంగాణ మున్సిపల్ సిబ్బంది కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం తరఫున కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డిని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రస్థాయిలో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న వనంపల్లి జైపాల్ రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించడంపై కార్మిక సంఘాల నాయకులు,కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ ప్రాంతం నుంచి కార్మిక ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్న నాయకుడికి రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యత దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ..సిపిఐ పార్టీ,ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న నాయకులను గుర్తించి తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం ఎంతో గర్వంగా ఉందన్నారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాబోయే కాలంలో కూడా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ముందుండి పోరాటాలు నిర్వహిస్తానని తెలిపారు.కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు,వేతనాలు,ఉద్యోగ భద్రత,సామాజిక భద్రత,కార్మిక హక్కులు తదితర అంశాలపై మరింత బలమైన ఉద్యమాలను చేపడతామని పేర్కొన్నారు.వనంపల్లి జైపాల్ రెడ్డికి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి దక్కడంతో కాటేదాన్,రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు.

## మైలార్ దేవ్ పల్లిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..





**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లిలోని దుర్గా కన్వెన్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆదర్శ ఉపాధ్యాయుడు,మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ప్రతి ఏడాది సెప్టెంబర్5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే..ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు,పురస్కారాలను అందజేశారు.విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.విద్యార్థులకు కేవలం విద్యాబోధన చేయడమే కాకుండా వారిలో క్రమశిక్షణ,మానవతా విలువలు,సామాజిక బాధ్యతలను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని,తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను వారు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి,త్యాగం,నిస్వార్థ సేవలు ఉంటాయని అన్నారు.ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా వారి సేవలకు గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు.మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పురస్కారాలు అందజేయడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ రాథోడ్,ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్,ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి,రవి,శ్రీనివాస్‌తో పాటు మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు,విద్యాశాఖ అధికారులు,స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి సేవలను గుర్తించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# పత్తికుంట గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి బృందం

**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**రాజేంద్రనగర్‌లోని హనుమాన్‌నగర్ పత్తికుంట గణేష్ నిమజ్జన ఏర్పాట్లను జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిమజ్జన ప్రాంతంలో చేపట్టిన పనులు,వాహనాల రాకపోకలు,విగ్రహాల తరలింపు,క్రేన్ల ఏర్పాటు,విద్యుత్ సౌకర్యాలు,పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.మంజూరైన పనులు ఏ మేరకు పూర్తయ్యాయి,ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటి అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు,విద్యుత్ సరఫరా,వెలుతురు,తాగునీరు,పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిమజ్జన సమయంలో ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.అదేవిధంగా నిమజ్జన ప్రాంతంలో అవసరమైన యంత్రాలు,వాహనాలు,క్రేన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లలో ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్



రెడ్డి,పర్యవేక్షణ ఇంజనీర్ నరేందర్ గౌడ్,డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి,విద్యుత్ విభాగం పర్యవేక్షణ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి,సహాయ ఇంజనీర్ యాదయ్య,భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ వై.శ్రీధర్,రాజేంద్రనగర్ డివిజన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.బాబురావు,ఈ.వేణుగోపాల్,కాంట్రాక్టర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.నిమజ్జన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కాటేదాన్‌లో వీధిదీపాలు లేక అంధకారం..

**చీకట్లో ఇబ్బందులు పడుతున్న జనం**

**మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** కాటేదాన్ పరిధిలోని మోహన్‌రెడ్డినగర్, బాబుల్‌రెడ్డినగర్,బృందావన్‌కాలనీ, లాల్‌బహదూర్‌నగర్, అర్జున్‌బస్తీ (వడ్డెరబస్తీ), ఆదర్శనగర్,బుద్వేల్ రైల్వేస్టేషన్ ప్రాంతం ,నేతాజీనగర్,శ్రీరామ్‌నగర్,వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాలు వీధిదీపాలు లేక చీకటిలో కొట్టుమిట్టాడుతున్నాయని మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల కురుస్తున్న వర్షాలకు చీకటి తోడవడంతో విషపురుగులు,పాములు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.మరోవైపు డ్రైనేజీ సమస్యలు,రోడ్లపై నిలిచిపోయిన నీటితో దోమల తీవ్రత పెరిగి చిన్నారులు,వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యలపై సంబంధిత అధికారులకు,ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు.దరుహులుం మదర్సా నుంచి శివరాంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఒక్క వీధిదీపం కూడా వెలగడం లేదని వెంకటేష్ పేర్కొన్నారు.రాత్రి వేళల్లో ఈ మార్గం చీకటిమయంగా మారడంతో మహిళలు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.చీకటిని ఆసరాగా చేసుకుని ఆకతాయిల వేధింపులు,దొంగతనాల భయం నెలకొన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.ఇంతటి సమస్య ఉన్నప్పటికీ ఈ మార్గంలో పోలీసుల గస్తీ కూడా తగినంతగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్న తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వీధిదీపాలు లేకపోవడం వల్ల ప్రజల భద్రతతో పాటు రాత్రివేళల్లో రాకపోకలు సాగించే మహిళలు,వృద్ధులు,పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.వర్షాకాలంలో చీకటి ప్రాంతాల్లో విషపురుగులు,పాముల సంచారం పెరిగే అవకాశం ఉన్నందున తక్షణమే వీధిదీపాలు ఏర్పాటు చేయాలని




కోరారు.అదేవిధంగా నిలిచిపోయిన నీటిని తొలగించి డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాటేదాన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పనిచేయని వీధిదీపాలను మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఎస్.వెంకటేష్ కోరారు.శివరాంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ప్రత్యేకంగా వెలుతురు ఏర్పాటు చేసి,పోలీసుల గస్తీని పెంచి ప్రజలకు,ముఖ్యంగా మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల రాము యాదవ్,గుమ్మడి కుమార్,మైసిరెడ్డి,గంజి రాజు,కొంపల్లి జగదీష్,కార్మిక శాఖ విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను,అశోక్ కుమార్,రామస్వామి,సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు సర్పంచుల సంఘం వినతి:

**సర్పంచ్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సమస్యల ఏకరవు.!**

**కారేపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఖమ్మం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు అబ్బూరి నరహరి నేతృత్వంలో జిల్లాలోని 20 మండలాలకు చెందిన సర్పంచులు బుధవారం జిల్లా కలెక్టర్,అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, లను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్ కుమార్ చొరవ చూపి,సర్పంచులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. సర్పంచుల సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.వెంటనే డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసర్(డిపిఓ)తో మాట్లాడి, సర్పంచుల పెండింగ్ వేతనాలను ఇమిడియెట్లీగా విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు.అలాగే మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచుల బృందానికి హామీ ఇచ్చారు.

**వినతి పత్రంలో పేర్కొన్న ప్రధాన డిమాండ్లు..**

గ్రామాల్లో గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి (ఎంబీ)రికార్డులు పూర్తయిన వెంటనే నిధులను విడుదల చేయాలి,స్టేట్ ఫైనాన్స్ నిధులతో పాటు రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే మంజూరు చేయాలి,సర్పంచుల వేతనాన్ని రూ. 25,000లకు పెంచాలి,అలాగే ప్రతి నెలా వారి వేతనాన్ని నేరుగా బ్యాంక్ అకౌంట్లలోనే జమ చేయాలి,ఎమ్మెల్సీ ఎన్నికలలో సర్పంచులకు కూడా ఓటు హక్కు కల్పించాలి,ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మేజర్ పంచాయతీలకు రూ.10 లక్షలు,మైనర్ పంచాయతీలకు రూ.5 లక్షల నిధులను తక్షణమే విడుదల చేయాలి. :కొన్ని గ్రామాల్లో ఉపసర్పంచులు



చెక్కులు, నోటిఫైల్స్‌పై సంతకాలు పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారని,ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.సర్పంచుల హక్కుల సాధన కోసం మరియు గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్ రంజిత్ కుమార్ మరియు సర్పంచుల సంఘం ప్రతినిధులు చేసిన ఈ కృషిని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ కే.సౌభాగ్యను పరామర్శించిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ కౌన్సిలర్ కే.సౌభాగ్యను రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పరామర్శించారు.కే.సౌభాగ్య ఆరోగ్యం బాగాలేదని తెలుసుకున్న కార్తీక్ రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమెతో మాట్లాడి ధైర్యం చెప్పారు.త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో పరామర్శించి అండగా నిలవడం మానవతా విలువలకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.కే.సౌభాగ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,వీర్లపల్లి నవీన్ కుమార్,సదాల వెంకటరెడ్డి,శివముదిరాజ్,రాము యాదవ్,తానేష్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలు..

**ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**




**మేడ్చల్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి73వ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు ,కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఇందులో భాగంగా మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి,వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మల్లారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఆయన జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు.ఎమ్మెల్యే మల్లారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాస్కర్ యాదవ్,పార్టీ నాయకులు సందీప్ గౌడ్,మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఆకిటి నవీన్ రెడ్డి,అలీ, రఘుపతిరెడ్డి,విష్ణుచారి,సుశాంత్ రెడ్డి, ప్రభాకర్,శైలేందర్,దగ్గు పవన్,అవుతార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉసిరికాయలపల్లిలో ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక సమావేశం..


**160మందికి పైగా నోటీసులు జారీ..**

**ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో ఎస్.ఐ.ఆర్.ఈ ఓట్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగింది...**



**కారేపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో ఓట్ల జాబితా సవరణకు చివరి తేదీ కావడంతో, జాబితాలో తప్పులు దొర్లిన దాదాపు 160నుండి 170మంది ఓటర్లను గుర్తించి వారికి అధికారులు నోటీసులు జారీ చేశారు.ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా,ఓట్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మిరాజు, ఎంపీఓ రవీంద్ర,సెక్రటరీ నిరంజన్,అంగన్‌వాడీ సూపర్‌వైజర్,వార్డు మెంబర్ ప్రమీల,అంగన్‌వాడీ టీచర్లు,పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు ఆకారపు అరుణ్ పటేల్ టీం ఘన జన్మదిన శు భాకాంక్షలు



**ఉప్పల్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించు కుని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలోని యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం కేక్ కట్ చేసి,పటాకులు పేల్చి ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...అనిల్ కుమార్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ కపర, సాయి కృష్ణ,జయం దినేష్,నవీన్,సాయి,మిట్టు, భాష,అనిల్,శివ తదితర ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొని అనిల్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పీఎం శ్రీ టీజీ మోడల్ స్కూల్‌లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం..



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో తెలంగాణ భాష,యాస,సంస్కృతిని పరిరక్షించుకోవాలని పీఎం శ్రీ టీజీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ పిలుపునిచ్చారు.కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ...తెలంగాణ భాష, సంస్కృతి,సామాజిక చైతన్యం కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.కాళోజీ రచనలు సామాన్య ప్రజల జీవన విధానం, వారి భావోద్వేగాలు,సామాజిక సమస్యలకు అద్దం పట్టాయని పేర్కొన్నారు.తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ యాస,తెలుగు భాష ప్రాముఖ్యత, సాహిత్యం,సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కాళోజీ రచనలు,కవితలు,ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు.తెలంగాణ భాషా వైభవాన్ని కాపాడటం కేవలం సాహితీవేత్తల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాషను గౌరవిస్తూ భావితరాలకు అందించాలని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెన్నూర్ లో విద్యార్థినులకు హెచ్ పివి వ్యాక్సిన్ పై అవగాహన..



**చెన్నూర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**చెన్నూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్),ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ (ఎఎఎఫ్ఎ)ఆధ్వర్యంలో హెచ్ పివి వ్యాక్సిన్ పై అవగాహన కల్పించారు.సినీ హీరో అల్లు అర్జున్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ విద్యార్థులకు వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరిస్తున్నామని వారు తెలిపారు.సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుంటామని ఎఎఎఫ్ఎ,సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అంజియాదవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రెసిడెంట్ అక్బర్, చెన్నూర్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బజ్జూరి వినయ్,టౌన్ ప్రెసిడెంట్ అల్లు అభి, బద్రి,బత్తుల వేణు,బన్నీ శ్రావణ్,రఘు,తగరం లోకేష్ పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యల పరిష్కారానికి జేసీకి వినతి..





**చెన్నూర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సర్పంచులు బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీరాములును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ...గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,ఆర్థిక, పరిపాలనా పరమైన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛతో పాటు సర్పంచులకు తగిన అధికారాలు కల్పించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఉపసర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయాలి, గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్స్ వినియోగంపై ఉన్న ఆంక్షలను తొలగించాలి,ట్రెజరీ విధానంతో సంబంధం లేకుండా పంచాయతీ ఖాతా ద్వారా నిబంధనల ప్రకారం నిధులు వినియోగించుకునే అవకాశం కల్పించాలి,సర్పంచుల గౌరవ వేతనాన్ని నెలకు రూ.60 వేలుగా పెంచాలి,గ్రామ పంచాయతీలకు తగిన ఆర్థిక వనరులు,పరిపాలనా స్వేచ్ఛ కల్పించాలి,సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు దాసరి మణిదీపక్,ప్రధాన కార్యదర్శి పులి రాజశేఖర్,రామగిరి రాము, బీరాయా,గోపి,కృష్ణ,సతీష్,సాయికృష్ణ,పున్నం తిరుపతి,లక్ష్మణ్ తదితర జిల్లా కమిటీ సభ్యులతో పాటు వివిధ మండలాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం పోరాడి..కార్మికుల కోసం నిలబడి..

**ఒకే జెండా..ఒకే పయనం..**

**మందమర్రి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన**

**జె.రవీందర్ అస్తమయం..**

**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** తెలంగాణ ఉద్యమం నుంచి సింగరేణి కార్మిక పోరాటాల వరకు..రాజకీయ ఒడిదుడుకుల్లోనూ ఒకే పార్టీ జెండాను పట్టుకుని సాగిన నిబద్ధత కలిగిన నాయకుడు జె.రవీందర్ (54)ఇక లేరు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు.ఆయన మరణంతో మందమర్రి పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌తోనే..**

2001లో కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ఆవిర్భవించిన నాటి నుంచే జె.రవీందర్ పార్టీలో చేరారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొంటూ యువతను ముందుకు నడిపించారు.పార్టీకి కష్టకాలం వచ్చినా వెనుకడుగు వేయకుండా కార్యకర్తగా, నాయకుడిగా కొనసాగారు.రాజకీయ సమీకరణాలు మారినప్పటికీ పార్టీలు,జెండాలు మార్చని నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది.బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో తనదైన ముద్ర వేశారు.

**కార్మికుల గొంతుకగా..**

సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తూనే కార్మిక సమస్యలపై గళమెత్తారు.టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మందమర్రి ఏరియాలో టీబీజీకేఎస్ బలోపేతానికి ఆయన చేసిన కృషిని కార్మిక వర్గాలు గుర్తుచేసుకుంటున్నాయి.

**'జేఆర్' అంటే ఓ సలహా..ఓ భరోసా**

మందమర్రి రాజకీయ వర్గాల్లో 'జేఆర్'గా సుపరిచితుడైన రవీందర్‌కు పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక స్థానం ఉండేది.చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పీఏగా పనిచేసిన సమయంలో స్థానిక సమస్యలు,అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన చురుకుగా వ్యవహరించారు.ఎన్నికల సమయంలో అభ్యర్థులు,పార్టీ నాయకులు స్థానిక ప్రచార వ్యూహాల రూపకల్పనలో ఆయన సలహాలు తీసుకునేవారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. యువతకు అండగా నిలుస్తూ పలువురిని రాజకీయంగా ప్రోత్సహించారు.



**పదవి లేకున్నా..ఉద్యమ స్ఫూర్తి వీడలేదు..**

బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా,స్థానికంగా పార్టీకి రాజకీయ ఎదురుదెబ్బలు తగిలినా రవీందర్ తన కార్యకలాపాలను ఆపలేదు.మందమర్రి పాతబస్టాండ్ చౌరస్తాలో ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారు.ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటారు.

**జేఆర్ లేని లోటు పూడ్చలేనిది..?**

రవీందర్ మృతి వార్త తెలియగానే బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణుల్లో విషాదం నెలకొంది.వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు.తెలంగాణ ఉద్యమ సహచరుడిగా,కార్మిక నేతగా,పార్టీ కార్యకర్తగా, ఆత్మీయుడిగా రవీందర్ అందించిన సేవలను పలువురు నాయకులు స్మరించుకున్నారు.రాజకీయ పరిస్థితులు మారినా తన నమ్మకాన్ని మార్చుకోని నాయకుడిగా జె.రవీందర్ ప్రస్థానం మందమర్రి రాజకీయ చరిత్రలో నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.రవీందర్ అంత్యక్రియలు గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## నిస్వార్థ సమాజ సేవలకు గుర్తిపుగా నంది అవార్డు అందుకొన్న శ్రీనివాసచారి..



**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** హైదరాబాద్ నగర బొడ్డున ఉంటూ సమాజ సేవయే ఊపిరిగా గోశాలలు ఏర్పాటు చేయడం,పెద్ద,మధ్య తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఇప్పియడం,వయసుమళ్ళిన పెద్ద,మధ్య తరగతి వృద్దులను చేస్తోరదిసి వృధాశ్రమంలో చేర్పించడం వంటి సమాజ సేవలో లీనమైన శ్రీవాసచారి సేవలను గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా,గాన కోకిల కళానికేతన్ సంయుక్తముగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాన కోకిల కళానికేతన్ కార్యవర్గం ఉత్తమ సమాజ సేవకులుగా గుర్తించి శ్రీవాసచారి నంది అవార్డుతో సత్కరించారు.ఈ సందర్భంగా శ్రీవాసచారి పలువురి ప్రశంసలు అందుకొవడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...నంది అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని,ఆనందంతో పటు భాద్యతను కూడా పెంచుతుందని తెలిపారు.తాను పురాతన దేవాలయాకు దాతల చేత సహాయం అందించేందుకు కృషి చేయడం,గోసేవయే మాధవ సేవ అని అందులో గోశాలలు ఏర్పాటు చేసి పశుగ్రాసం సమకూర్చడం జరుగుతోందన్నారు.రోడ్లపై తిరుగుతున్న గోవులను చేరదీసి వాటిని సమీపంలోని గోశాలలకు అప్పగించడం జరుగుతోందని పేర్కొన్నారు.

## గుడిసె యాదయ్య తల్లి దశదినకర్మకు హాజరైన కొండా విశ్వేశ్వర్ రెడ్డి,పట్లోళ్ల కార్తిక్ రెడ్డి



**రాజేంద్రనగర్,సెప్టెంబర్09(సూర్యరేఖ)** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్,డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు గుడిసె యాదయ్య తల్లి యాదమ్మ దశదినకర్మకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గుడిసె యాదయ్య కుటుంబసభ్యులను విడివిడిగా వారు పరామర్శించారు.అనంతరం ఆయన తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన యోగక్షేమా లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని గుడిసె యాదయ్యను పరామర్శించారు. బీజేపీ, కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు వై.శ్రీధర్,శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్య,నోముల రాముయాదవ్,సదాల వెంకట్ రెడ్డి ,శివముదిరాజ్,పచ్చ శ్రీనివాస్,పంబాల రాజు, జగదీష్, వేణుగోపాల్, బాబురావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు గుడిసె యాదయ్యతో ఆప్యాయంగా మాట్లాడి ఆయనకు ధైర్యం చెప్పారు.పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఒకే వేదికపై పాల్గొని పరామర్శించడం విశేషంగా నిలిచింది

## ఆశాజ్యోతి ఆశ్రమంలో ఘనంగా మల్లారెడ్డి జన్మదిన వేడుకలు..



**మేడ్చల్,సెప్టెంబర్09 (సూర్యరేఖ)**మాజీ మంత్రి ,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ భద్రారెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ పట్టణంలోని ఆశాజ్యోతి ఆశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని సుమారు 350మంది విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి,చిన్నారులతో కలిసి బీఅర్ఎస్ నాయకులు భోజనం చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఆకీటి నవీన్ రెడ్డి మాట్లాడుతూ. ..మల్లారెడ్డి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.రానున్న రోజుల్లో కూడా మల్లారెడ్డి రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కోరుకుం టున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సద్ది సుశాంత్ రెడ్డి,మండల రవి, గొంగల్ల శేఖర్ రెడ్డి,కోల వెంకటేష్,దగ్గు పవన్, రఘు ,శ్రీనాథ్,వరుణ్ రెడ్డి, కార్యకర్తలు,ఆశ్రమ నిర్వాహకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో కారేపల్లిలో పకడ్బందీగా గణేష్ నవరాత్రి ముందస్తు చర్యలు..

శాంతియుత ఉత్సవాల నిర్వహణే ధ్యేయం:

కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా అవగాహన సదస్సు- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు...

సిఐ నునావత్ సాగర్,ఎస్సై భైరు గోపి హెచ్చరిక...





**కారేపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కారేపల్లి పోలీసులు అడుగులు వేస్తున్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కారేపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో బుధవారం సాయంత్రం గణేష్ మండపాల నిర్వాహకులు,డీజే యజమానులు, మరియు వివిధ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సిఐ నునావత్ సాగర్,ఎస్సై భైరు గోపిల సారథ్యంలో ఒక ఉన్నత స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కారేపల్లి మండలంలో ఉత్సవాలు అత్యంత ప్రశాంతమైన,క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో జరిగేలా పోలీసులు తీసుకున్న ఈ ముందస్తు చర్యలు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకునేలా సాగాయి.ఈ సందర్భంగా సిఐ నునావత్ సాగర్ నిర్వాహకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ఉన్నతాధికారుల మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా ఆన్‌లైన్ లేదా పోలీస్ స్టేషన్ ద్వారా అనుమతి పత్రాలు పొందాలని, విద్యుత్ లైన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని,ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి మండల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎస్సై భైరు గోపి మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డీజేల వినియోగంపై కఠిన నిబంధనలు అమలులో ఉంటాయని, అనుమతించిన డెసిబుల్స్ పరిమితి దాటితే సౌండ్ సిస్టమ్స్ జప్తు చేయడమే కాకుండా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులే ప్రత్యేక వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.కారేపల్లి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల నిర్వహణలో జిల్లాలోనే కారేపల్లి పోలీస్ స్టేషన్ ఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది,గణేష్ కమిటీ ప్రతినిధులు,డీజే ఆపరేటర్లు మరియు మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శృంగేరి శంకరమఠంలో భక్తిశ్రద్ధలతో మహాలింగార్చన..







**శంషాబాద్ ,సెప్టెంబర్09 (సూర్యరేఖ)** ఊట్‌పల్లి శ్రీశృంగేరి శంకరమఠం ఆధ్వర్యంలోని శ్రీశ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహిం చారు.శృంగేరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించబ డుతున్న ఈ ఆలయంలో ప్రతి మాస శివరాత్రి రోజు వేద పండితులతో మహాలింగార్చన నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. దాదాపు మూడు గంటల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించే మహాలింగార్చన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు .ఆలయ మేనేజర్ సోమయాజుల శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన పూజారి హిమాన్షు భరద్వాజ్ ఇతర పండితుల వేదమంత్రోచ్చారణల మధ్యన మహాలింగాభిషేకం నిర్వహించారు .అభిషేకం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు

## కళ్యాణిఖని సింగరేణి పాఠశాలలో భాషా దినోత్సవ వేడుకలు




**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని కళ్యాణిఖని సింగరేణి పాఠశాలలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, తెలంగాణ భాష,సాహిత్యం,సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ భాష, యాస ప్రత్యేకతను ప్రతిబింబించే ప్రసంగాలు,కవితలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు.తెలంగాణ మాండలికంలోని మాధుర్యం,స్థానిక సంస్కృతిలోని వైవిధ్యాన్ని తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు.ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు పురుషోత్తం మాట్లాడుతూ...తెలంగాణ భాష కేవలం మాట్లాడే యాస మాత్రమే కాదని,అది ఈ నేల చరిత్ర, సంస్కృతి,జీవన విధానానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు.మాతృభాషను గౌరవించడం, తెలంగాణ భాషా వైభవాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.విద్యార్థుల్లో తెలంగాణ భాష,యాస,సాహిత్యం,సంస్కృతిపై అవగాహనతో పాటు అభిమానం పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి తాహసిల్దార్ కార్యాలయంలో కాళోజీకి ఘన నివాళులు..



**బెల్లంపల్లి,సెప్టెంబర్09(సూర్యరేఖ)** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో స్వర్గీయ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ,ఉప తహసీల్దార్ హమీద్, మహమ్మద్,మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు బండి రాము తదితరులు పాల్గొన్నారు.తెలుగు భాష అభివృద్ధికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలను ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు.కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యం,సామాజిక స్పృహను పెంపొందించాయని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు..

గ్రామాల వారీగా పురోగతిపై జడ్పీ సీఈవో గణపతి ఆరా..



**మందమర్రి,సెప్టెంబర్09(సూర్యరేఖ)**గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో గణపతి సూచించారు.బుధవారం మందమర్రి ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన కార్యాలయ నిర్వహణ,రికార్డుల తీరును పరిశీలించారు.అనంతరం మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఎన్.రాజేశ్వర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.గ్రామాల వారీగా పూర్తయిన పనులు,కొనసాగుతున్న పనులు,ఇంకా ప్రారంభం కావాల్సిన పనుల పురోగతిపై ఆరా తీశారు.పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు,నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు.కార్యాలయ రికార్డులు,విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలు,నిమజ్జన ఊరేగింపుపై ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో సిపి సజ్జనర్ అధ్యక్షతన ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం..





## గణేశ్ నిమజ్జనం సజావుగా సాగేలా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి..

**నాంపల్లి,హైద్రాబాద్,సెప్టెంబర్09(సూర్యరేఖ)**గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు,నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను నగరంలో అత్యంత వైభవంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు హైదరాబాదు నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఖైరతాబాదులోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రభుత్వ అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్,జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్,జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్, జాయింట్ సిపి స్పెషల్ బ్రాంచ్ ఎస్.ఎం.విజయ్ కుమార్,జాయింట్ సిపి ఫ్యూచర్ సిటీ చందనా దీప్తిలతో పాటు హైదరాబాద్,సైబరాబాద్, మల్కాజ్‌గిరి,ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పోలీసు అధికారులు,కలెక్టర్లు,హైడ్రా,ఆర్టీసీ,ఫైర్ సర్వీసెస్,సమాచార పౌరసంబంధాలశాఖ, రవాణా,పర్యాటక,ఆరోగ్య,రోడ్లు భవనాలు, విద్యుత్,వాటర్ వర్క్స్,హెచ్ఎండిఎ,మెట్రో రైల్,ఎమ్ఎమ్‌టిఎస్ శాఖల ప్రతినిధులు హాజరై తమ శాఖల వారీ తీసుకోబోయే చర్యల ఏర్పాట్లను వివరించారు.ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనర్ మాట్లాడుతూ...గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ముఖ్యంగా విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్లకు అడ్డంగా వేలాడుతున్న,వదులుగా ఉన్న విద్యుత్, కేబుల్ మరియు ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించాలని,రామాంతపూర్ లాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన ఎత్తు వరకు క్లియరెన్స్ ఇవ్వాలని స్పష్టం చేశారు.గణేష్ మండప నిర్వాహకులకు నిబంధనల ప్రకారం సురక్షితమైన విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని,తప్పనిసరిగా ఎర్తింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టరేట్ అనుమతులు పొందాలని సూచించారు.విద్యుత్ శాఖాధికారులు పోలీసు శాఖతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని,ఏదైనా సరఫరా నిలిపివేత లేదా వైర్ల తొలగింపు చర్యలు తీసుకునే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు.అలాగే నిమజ్జనానికి సంబంధించి సెప్టెంబర్ 14,15వ తేదీ నాటికే ప్రధాన మార్గాలు మరియు ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్డు,నాలాల స్లాబ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు కానీ కేబుల్ వేసే పనులు ప్రారంభించవద్దని తెలిపారు.పాతబస్తీ ప్రాంతంలో మెట్రో నిర్మాణ పనుల దృష్ట్యా విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ జిల్లా పరిధిలో 26 ప్రాంతాల్లోనూ,అలాగే బాలపూర్ పరిధిలోనూ ప్రత్యేక వైద్య శిబిరాలు,అంబులెన్సులు,పారామెడికల్ సిబ్బందిని 24/7 అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరడంజరిగింది.ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా,మెరుగైన పారిశుధ్య చర్యలు నిరంతరం కొనసాగాలని వాటర్ వర్క్స్,జిహెచ్ఎంసి అధికారులను కోరారు.ట్రాఫిక్ నిర్వహణ,వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి తగినంత పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని,ఆర్టీసీ మరియు రవాణా శాఖ అధికారులు తగినన్ని బస్సులు,గూడ్స్ వాహనాలు అవసరమైన డ్రైవర్లను సమకూర్చాలని సూచించారు.నిమజ్జనం రోజున అవసరమైన క్రేన్లు,వాటి ఆపరేటర్లు,సూపర్‌వైజర్లు,మెయింటెనెన్స్ టీమ్‌ల వివరాలను ముందస్తుగా పోలీసు శాఖకు అందజేయాలన్నారు.బడా గణేష్ దర్శన ముగింపు వివరాల వంటి ముగంపు సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు టీవీ స్క్రోలింగ్‌లు,పేపర్ నోటిఫికేషన్లను విస్తృతంగా ఉపయోగించాలన్నారు.సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన నిమజ్జనం సందర్భంగా ప్రజల సౌకర్యార్థం నగరంలో అర్ధరాత్రి 1గంట వరకు మెట్రో రైలు సేవలను,అలాగే నాంపల్లి, లక్డీకాపూల్,ఖైరతాబాద్,సంజీవయ్య పార్క్,జేమ్స్ స్ట్రీట్,బెగంపేట్ స్టేషన్ల నుండి రాత్రంతా ఎంఎమ్‌టిఎస్ రైళ్లను నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.ఖ

# చిన్న గాయం..పెద్ద ప్రమాదం

### మధుమేహుల్లో పాదాల పుండ్లపై అప్రమత్తతే రక్షణ..

### సకాలంలో గుర్తిస్తే కాలు కాపాడుకోవచ్చు..

### ఆధునిక ఎండోవాస్కులర్ చికిత్సలతో మెరుగైన ఫలితాలు..

### వాస్కులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్




**మంచిర్యాల,సెప్టెంబర్09(సూర్యరేఖ)** మధుమేహం ఉన్నవారికి పాదాలపై ఏర్పడే చిన్న గాయం కూడా నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని వాస్కులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్ హెచ్చరించారు.పాదాల్లో రక్తసరఫరా తగ్గడం, నరాల పనితీరు దెబ్బతినడం,ఇన్ఫెక్షన్లు వంటి కారణాలతో పుండ్లు దీర్ఘకాలిక సమస్యలుగా మారవచ్చని తెలిపారు.బుధవారం మంచిర్యాల పట్టణంలోని ప్రముఖ నార్తిన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మధుమేహ బాధితులు పాదాలపై ఏర్పడే గాయాలను సాధారణ గాయాలుగా భావించి ఇంటి వద్దే చికిత్స చేసుకోవడం ప్రమాదకరమని పేర్కొన్నారు.గాయం మానకపోవడం,పాదాల్లో నొప్పి లేదా వాపు,చర్మం రంగు మారడం,పాదాలు చల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

### రక్తసరఫరా తగ్గితే పుండు మానడం కష్టం..

కాళ్లకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడితే పుండ్లు మానేందుకు అవసరమైన రక్తప్రవాహం తగ్గిపోతుందని డాక్టర్ వినయ్ కుమార్ వివరించారు.ధమనులు,సిరలకు సంబంధించిన సమస్యలను ముందుగా గుర్తించడం ద్వారా చికిత్సను సరైన దిశలో కొనసాగించవచ్చన్నారు. రక్తసరఫరా పరిస్థితిని తెలుసుకునేందుకు ఎబిఐ, ఆర్టీరియల్ డాప్లర్,వీనస్ డాప్లర్, సీటీ పెరిఫెరల్ యాంజియోగ్రామ్,ఎంఆర్ఐ పెరిఫెరల్ యాంజియోగ్రామ్ వంటి పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు.వీటి ద్వారా రక్తనాళాల్లో బ్లాకులు ఉన్న ప్రదేశం,వాటి తీవ్రతను గుర్తించవచ్చన్నారు.

### కాలు తొలగించే పరిస్థితి రాకముందే..

రక్తనాళాల్లో ఏర్పడిన బ్లాకులను తొలగించి రక్తప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు పెరిఫెరల్ యాంజియోప్లాస్టీ,పెరిఫెరల్ బైపాస్ సర్జరీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సకాలంలో రక్తసరఫరాను పునరుద్ధరిస్తే పుండ్లు మానేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు.

### రోజూ పాదాలను పరిశీలించాలి..


మధుమేహ బాధితులు ప్రతిరోజూ తమ పాదాలను పరిశీలించుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. పాదాలపై చిన్న పగులు,బొబ్బలు,గాయాలు,రంగు మార్పులు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాలని అన్నారు.ముందస్తు జాగ్రత్తలు, సకాలంలో నిర్ధారణ,ఆధునిక చికిత్సతో తీవ్రమైన పాద సమస్యలను నివారించడంతో పాటు కాళ్లను కాపాడుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ పీఆర్వో అంకం మల్లేష్ పాల్గొన్నారు.


# ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్‌లెట్ మెగా సేల్స్‌కు శ్రీకారం..



## లేడీస్,మెన్స్,కిడ్స్ వేర్‌తో పాటు ప్రీమియం బెడ్‌షీట్స్, కర్టెన్స్,బాత్ టవల్స్ తదితర హోమ్ ఫర్నిషింగ్స్‌ను ఫ్యాక్టరీ ధరలకు..

**కాప్రా,సెప్టెంబర్09(సూర్యరేఖ)** పండుగల సీజన్‌ను పురస్కరించుకుని కూకట్‌పల్లి, కుషాయిగూడ ఈసీఐఎల్ 'ఎక్స్'రోడ్స్‌లో ఆర్.ఎస్.బి ఫ్యాక్టరీ అవుట్‌లెట్ డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్లు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ టీవీ వ్యాఖ్యాత రష్మిగౌతమ్ ఈ ఎగ్జిబిషన్లను ప్రారంభించారు. కూకట్‌పల్లిలో సెప్టెంబర్9నుంచి 17వరకు ,కుషాయిగూడలో సెప్టెంబర్ 9నుంచి16వరకు మెగా సేల్స్ కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పండుగలు,పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ, ఆధునిక శైలుల్లో వివిధ రకాల వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. నాణ్యతతో పాటు పొదుపు ధరలకు నేరుగా ఫ్యాక్టరీ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నామని, కుషాయిగూడ పరిసర ప్రాంతాల వస్త్ర ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.








Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713